శ్రేయస్కరా శ్రీధరా

నారుమంచి వేంకట అనంత కృష్ణ

శ్రేయస్కరా శ్రీధరా

శతకము

నారుమంచి వేంకట అనంత కృష్ణ

శ్రేయస్కరా శ్రీధరా శతకం

ప్రథమ ముద్రణ -
శ్రీ దుర్ముఖ శ్రావణం, ఆగష్టు 2016

రచయిత : ఎన్.వి.అనంతకృష్ణ

వెల : అమూల్యం

సర్వహక్కులు రచయితవి.

ప్రాప్తి స్థానము :
ఎన్.వి.అనంతకృష్ణ
ప్లాట్ నెం.80, శ్రీ సాయి నగర్,
రోడ్డు నెం.4, శ్రీ సాయిబాబా గుడి ఎదురుగా,
నాగోల్ పోస్ట్, హైదరాబాద్ - 500 068.
ఫోన్- 92465 31895.

మంత్రమూలం గురోర్వాక్యం

చి॥ అనంతకృష్ణ రచించిన లలితా దేవి యొక్క స్తవరూపమైన శతకమును చూచితిని. అతి లలితమైన పదముల సమూహముతో, సమాస భూయిష్టమై అన్వయ కాఠిన్యమును లేక, మిక్కిలి చెవులకింపైన పరిశుద్ధమైన అచ్చతెనుగు పదములతో ధారాశుద్ధి గలిగి లలితా స్తవమును రచించిన మా శిష్యునికి శతాయువు లొసంగి నిత్యోన్నత స్థితిని కల్గించవలసినదని మదీయ యిష్టదైవమైన శ్రీమన్మహారాజరాజేశ్వరీ షోఢాంబా జగన్మోహినీ పరదేవతా శ్రీమహా త్రిపుర సుందరిని ఆశీస్సులిమ్మని కోరుకుంటూ..

ఇట్లు

పరమానందనాథ దీక్షానామాంకిత
విద్వాన్ రాళ్లభండి సుబ్రహ్మణ్య దీక్షితులు
తేదిః 16.6.2002

ఆశీర్వచనము

చిరంజీవి శ్రీ అనంతకృష్ణ గారు కవితా శ్రీయుతులు. ఇత: పూర్వము మూడు శతకములు వ్రాశారు. గురుకృపా కటాక్ష లబ్ధులు. దిన దిన ప్రవర్ధమానులై మంచి శతకాలను వ్రాయుచున్నారనటము కన్నా గురుకృపా కటాక్షలబ్ధమై లలితాదేవి వ్రాయించుకుంటున్నదంటే అతిశయోక్తికాదు. కవి మంచి భాషాజ్ఞ్జానము కలవాడు. ఆపైన గురుకృప కలవాడు, మంత్ర సిద్ధి పొందినవాడు, వినయ భూషితుడు, భక్తి భావన అపారము, బుధజన విధేయుడు, సద్గుణాలప్రోది. ఇన్ని ఒక్కచోట వుంటే శత శతకాలు కవి ఘంటము నుంచి వచ్చినా అశ్చర్యములేదు. పూర్వము వచ్చినవి మూడు శతకాలు. మరి ఇది నాల్గవది. ఒక్కొక్కటి కల్తి లేని స్వర్ణ సమానము. వీరి కవిత్వములో భక్తి, ముముక్షుత, పాండిత్యము, భాషాసంపద, వినమ్రత వుట్టిపడుతున్నది. కవి గడుసరి. ఎంతయినా వకీలు కదా. ఆ ఛాయ అక్కడ అక్కడ వారి కవిత్వములో కనపడుతుంది.

ఇక శతకము గురించి నా రెండు మాటలు.

భళిరా కవి భక్తి భావన–కవి భక్తియే అటుల స్ఫురింపజేసి ఉండవచ్చు (5). బ్రహ్మజ్ఞానము రాముడేయంచు కవి భావము ముదావహము (10, 11). కవి గడుసుగా ఆరామున్నే ప్రశ్న నీవు సాకారుడవా – నిరాకారుడవా (12). భగవద్గీత భావము మార్గశీర్షుడవు నీవని వేడుట (14). లోని గీతకారుణ్ణి నిలదీసి ప్రార్ధించుట నేర్పు (15). అహెూ జగదాత్మ భావనము (16). నాలో నిన్నిడి అనేమాట ఆధ్యాత్మతకు చివరి మెట్టు (20)

చక్కనిభావము – ఏకత్వము చూడలేదన్నమాట(25). కవిలోని భావ ధృడతకు భావ గంభీరతకు ఒక మచ్చు తునక (28). భగవంతుని సర్వవ్యాపకతను - (32). భక్తుని మాట నెరవేర్చుటకు అన్న భక్తిభావము అంత తేలికగా వచ్చేది కాదు - కవి తనలోని భక్తిని చూపించాడు. ఆత్మ పరమాత్మ ఒక్కటేయంచు భావన - చిక్కని బ్రహ్మజ్ఞాని తానంచు కవి తెల్పక తెలిపాడు (46). కవిని ఆఉన్మాదిగా మారమని మా ఆశీర్వచనము (49). శ్రీ శబ్దాన్ని బహు రూపమ్ముల వాడి కవి తన కవిత్వ పటుత్వ నేర్పు చూపాడు (53). 57, 58 59, 62, 66, 72, 101 బహు భేషైన కవి పాటవము - ప్రాసాక్షరముల వాడిన తీరు ప్రశంసనీయము - ఈ విధముగా చాలా పద్యాలలో కవి తన ప్రతిభను చూపారు. సాధనల తెలిసెరా (59). శివ కేశవ ఏకత్వము బాగా చెప్పారు (66). భగవంతునిలోన వున్నదానిని కవి చమత్కారముగా వాడుకున్నాడు (71). కవి తనను హంసని చేయమనటము మంచి విన్నాణము (76). ఇష్టాపూర్తికి యజ్ఞాలు చేయువారికి ఒక చురక - ఇష్టమన్నా యజ్ఞమే (77). దీన శరణ్య అని చెప్పటము (78). జ్ఞాన రాద్ధంతము కన్నా భక్తి మేలని కవి చాతుర్యముగా చెప్పారు (79). కవి చాలా గడుసరిగా మత భేదాలను సునిశితముగా హెచ్చరించారు (82). ఆత్మను గూర్చి ఇంత చక్కగా చిన్నపదాలతో ఈ కవి తప్ప వేరెవ్వరూ చెప్పలేరేమో (83) గోప్యముగా నవ గ్రహాలను ఈ పద్యములో కవి జొప్పించారు(91) ఇక్కడ కవి పద బంధములో మకుటాన్ని చక్కగా తెలపటము గొప్ప కవిత్వ పద క్రీడ(92). సాధనా చతుష్టయము గురించి కవి సంజ్ఞ

బహు ఆమోదనీయము (94). కవి యొక్క ఏకాగ్రతకు ఉపమానము చాలా బాగున్నది (98). నామదిలోని మాయా జింకను పట్టుమన్న కవి చమత్కారము శ్లాఘనీయము (102).

మాట వరసకు నేనొకసారి కవితో అన్నాను మీలోని శక్తి సామర్ధ్యాలు అమోఘము. మీవంటి వారికి శతకాలు ఒక కవితా క్రీడ మాత్రమే. అవసరమయిన కొంచము కాలము వెచ్చించి కలకాలము ఉండేటట్లుగా ఒక బహుళార్ధ సాధకమయిన (కొందరితోకలిసి) చక్కటి మెప్పయిన ఉద్గ్రంధము వ్రాయమని అడిగాను. ఇప్పుడు ఈ శతక సంపుటికి అభిప్రాయము వ్రాయమని అడిగిన అదును చూసుకొని నేను ప్రార్ధించే నాలోని పరబ్రహ్మ వారితో ఆ ఉద్గ్రంధము వ్రాయించమని ప్రార్ధించుతూ వారికి వారి కుటుంబము మొత్తానికి బంధుమిత్రులకు

మా నారాయణ స్మరణ పూర్వక శుభాశీస్సులు.

08-07-2015 **విజ్ఞానానంద భారతి**

మకాం- హైదరాబాదు

రెండు మునకలు- రవ్వంత ప్రసాదం

కృతయుగంలో శ్రీ నారసింహుడై, త్రేతాయుగంలో శ్రీ రామచంద్రుడై, ద్వాపర యుగంలో జగద్గురువై శ్రీ కృష్ణుడై శ్రీ ఆదినారాయణుడు అవతరించిన విషయం వైదిక ధర్మపరులందకీ తెలిసినదే. ఈ ఆదినారాయణుడే శ్రీధరుడైన శ్రేయస్కరుడు. ఈ కవి శ్రేయస్కరా! శ్రీధరా! అనే సంబోధనతో ఒక శతకాన్ని వెలయించారు. శ్రీధరా అనే సంబోధనలో ఒక ప్రత్యేకత ఉన్నది. శ్రీ అంటే లక్ష్మీదేవి అని అర్థం. ఆ "శ్రీ" కి చంచల చపల అనే పేర్లు కూడా ఉన్నాయి. చంచల, చపల ఐన శ్రీని హృదయంలో నిశ్చలంగా నిలుపుకొన్నవాడు శ్రీధరుడు. "శ్రీ" నారాయణునకు అనపాయని. అనగా క్షణం కూడ విడువనిది. చంచలను స్థిరంగా నిలుపుకొన్న శ్రీధరుడు అఘటనా ఘటనా సమర్థుడని స్పష్టమౌతుంది. అటువంటి శ్రీధరుని సంబోధిస్తూ సాగింది ఈ శతకం. అఘటన ఘటనా సమర్థుని కీర్తిస్తే ఆయన మాత్రమే శ్రేయస్కరమై మానవ జన్మకు పరమార్థమైన అంశాన్ని- మనకు సామర్థ్యం లేకున్నా- సంఘటింప చేయగలడనే విశేషమైన అర్థం ఈ సంబోధనలో మనకు వ్యక్తమవుతోంది.

శ్రేయస్కరా శ్రీధరా అనే మకుటంతో శతకం వ్రాయడం ఒక సాహసమే. ఇది కవిత్వ సంబంధిత విషయం. సంబోధనలో మొదటి అక్షరం "శ్రే"(యస్కరా శ్రీధరా) అనే అక్షరానికి యతి మైత్రి చెల్లే విధంగా పద్య శతం వ్రాయాలి. అంటే ఆ "శ్రే" అనే అక్షరానికి యతిగా సరిపడే వంద శబ్దాలపై కవి వాల్లభ్యం సంపాదించవలసి ఉంది. ఆ పదాలు అర్థవంతముగా ఉంటూ, ప్రాసాక్షరంతో విరోధం పొందకుండా వ్రాయగలగడం కవి ప్రతిభకు నికషోపలమే. ఇటువంటి మకుటాలతో పూర్వం శతకాలు రాకపోలేదు. శ్రీ కాళహస్తీశ్వర శతకం అటువంటిదే.

వృత్తికి ప్రవ ృత్తికి సంబంధంలేక, నిరంతర బహు కార్యవ్యగ్రతతో ఉండే ఒక న్యాయవాది ఇలా ఇటువంటి మకుటాన్ని నిర్ణయించుకోవటం సాహసమే. అయితే ఈ కవి ఇతః పూర్వమే కొన్ని గ్రంథాలను వెలయించి ఉన్నారు. గురు స్తుతి, లలితా శతకం, గణేశ శతకం, శ్రీ అనంత భాస్కర శతకం ఈ కవి కలం నుండి జాలువారినవే. వీటిలో శ్రీ అనంత భాస్కర శతకం "సీసా"లతో మధువును నింపినది. ఆ శతకం ప్రపంచంలో ఉండే రస పిపాసువులకు మహానందం కలిగించింది. ఆ పూర్వ కవన పాటవం ఈ కవికి బాగా కలసివచ్చింది. అందుకే సీ, శీ, సృ, రీ,ఋ, జీ, చే అనేకాక్షరాలతో యతి కుదిరేలా శ్రే అనే అక్షరాన్ని యతిస్థానంలో గడుసుగా ఏర్పాటు చేసికొన్నారు.

ఇక విషయానికి వస్తే... ఈ శతకం పైకి వంద పద్యాల గ్రథనంగా కన్పడినా అందులో వ్యక్తం చేసిన భావాలు చాలావరకు ఆత్మ జ్ఞానానికి సంబంధించినవి. ఈ ఆత్మ జ్ఞానాన్ని ఆత్మ విద్య, బ్రహ్మ విద్య అని కూడా అంటూ ఉంటారు. అటువంటి బ్రహ్మవిద్యను అనుభవించడం ఒక ఎత్తు అయితే, అభివ్యక్తం చేయటం మరియొక ఎత్తు. ఈ ఎత్తులు అధిరోహించేటప్పుడు గణాలు, యతులు, ప్రాసలు అనే వేగ నిరోధకాలు అడ్డుకుంటాయి. వాటిని దాటుకుంటూ ముందుకు సాగడమంత కష్టం. ఈ కష్టాలను సునాయాసంగా దాటి శత శృంగాలను అధిరోహించిన మహనీయుడే కవి. ఆ శత శృంగాలపై రెపరెపలాడుతున్న పద్య కేతనాల ప్రభ ఈ శతకంలో దర్శనమిస్తుంది. ఉన్న విషయాన్నే అందంగా వ్యక్తీకరించడమే కవిత్వం. అంటే లోకంలో ఉన్న విషయాలను మాత్రమే కాక సత్య విషయాలను సుదర్శనం చేస్తూ, మన కనులముందు ఆవిష్కరిస్తున్నారీ కవి. ఈ పొత్తంలో

ఇటు కవిత్వము, అటు ఆధ్యాత్మిక భావం, ఆ పై బ్రహ్మ విద్య మూడు పాయలుగా ప్రవహించి త్రివేణీ సంగమంగా తయారయిందీ శతకం. ఆ త్రివేణీ సంగమంలో రెండు మూడు మునకలు వేసే ప్రయత్నం చేద్దాం.

మొదటి పద్యంలోనే కవి ఆంతర్యాన్ని బహు చక్కగా తెలియజేసారు. "రాశీభూత పురాకృతార్జిత ఫలా" అన్న సంబోధనలో ఏనాడో చేసికొన్న పుణ్యం వల్ల మాత్రమే నీవు ఫలంగా లభించావు అంటూ వినయాన్ని తెలియజేస్తూ ఈ ప్రయత్నం అంతా "నిరత సత్యాన్వేషణా దీక్ష"తో సాగుతుందనీ, నిజమైన భాగ్యం శాంత్యాదులు మాత్రమేనని ఆ భాగ్యాన్నే ప్రసాదించమని శ్రీధరుని ప్రార్థించడం చూస్తే కవికి గల "సత్యదృష్టి" మనకు అర్థం అవుతుంది. రెండవ పద్యం "రామా" అని ప్రారంభం అవుతుంది. ఈ శ్రీధరుడే త్రేతాయుగంలో శ్రీరాముడై అవతరించాడు సుమా అని మనను తట్టి చెప్పినట్టు ఉంటుంది. అలవోకగా సాగిన ఈ పద్య గమనం పాఠకులకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆనందాన్ని పంచుతుంది. రాత్రి నీవు రాజువు..... రా అని, తెల్లవారే సరికి కాదు... ఫో అన్నా పొంగక, క్రుంగక ఉండే నీ స్థితప్రజ్ఞత నాకు నేర్పవయ్యా అనడం ఎంత విశిష్టంగా ఉంది! ఈ కాలంలో పొంగక, క్రుంగక ఉండే లక్షణం లేకపోవడం వల్లే సమాజం అనారోగ్యంతో బాధ పడుతుంది. సామాజిక ఆరోగ్యాన్ని కోరుకోవడం కవి విధ్యుక్త ధర్మం.

ఇక మూడవ పద్యం శ్రీధరా నీవు రాముడవు మాత్రమే కాదు, అన్ని అవతారాలు నీవే అంటూ సాగిన ఈ పద్యం ముచ్చ్చటైన మూడవ పద్యం. దశావతారాలను స్ఫురింప చేసే పదాలు వచ్చి చేరడం కవి తపః ఫలమే.. "నీటన్ బుట్టుట" మత్స్యం, కొండ మోయుట–

కూర్మం, కోరలన్ దెచ్చుట- యజ్ఞవరాహం... ఇలా అన్వయించు కుంటూ మూడవ పద్యం చూస్తే అప్రయత్నంగా కవికి చేతులు జోడిస్తాం. పరశురాముణ్ణి స్ఫురింప చేసే పదం "గొడ్డళ్ళ చేబూనుటన్" అన్నది. ఎంత అద్భుతంగా ఉంది!!!

ఆరవ పద్యంలో "జీవేశా" అనే సంబోధనను, 8వ పద్యంలో "ఇది నీ లీల అంటావా? కరుణ అంటావా?" అని ప్రశ్నించడం, 11వ పద్యంలోని వేడికోలు, ఎంతో ఆసక్తికరంగా సాగుతాయి. 15వ పద్యంలో కృష్ణ చరిత్రను నాలుగు అంగలలో (నాలుగు పాదాలలో) చెప్పడం ఎంత సొగసు కన్పిస్తుంది!

స్వామీ రాళ్ళలో, చెట్లలో, రత్నాలలో అన్నిటా నీవు ఉన్నావని నమ్మే మేము నిన్ను మనుష్యులలో చూడలేక పోవడం ఎంత దురదృష్టం. ఇది దుశ్శీలమా! మానవుని మాధవునిగా అంగీకరించడానికి భయమా అని (18వ పద్యం) ప్రశ్నించడం మనలను ఆలోచింపచేస్తుంది. 19వ పద్యం (దీన్ని శ్లోకం అనాలేమో!) కవి యొక్క గీర్వాణాన్ని తెలియజేస్తుంది. 24వ పద్యం నారికేళ సమర్పణం నిజంగా ఆలోచనామృతమే.

28వ పద్యంలో బ్రహ్మవిద్యకు సంబంధించిన విషయాన్ని అనుసంధానం చేసికో వీలున్నది. ప్రయత్నిస్తే ఫలితం తథ్యం. 35వ పద్యంలో శ్రీధరుని చేయి అందిమ్మని ప్రార్థించడం సహజ సుందరంగా ఉంది. 51వ పద్యం వంటి క్లిష్ట ప్రాస పద్యాలు వీరి కవిత్వంలో సయ్యాటలాడడం మనం గమనిస్తాం.

56వ పద్యంలో పరమాత్మను క్రీనీడలు తొలగించి చూడండి అని సూచన చేయడం, నీ పాదార్చన నన్ను పూత చరిత్రుని చేయదా అని ధీమా చూపడం, 72వ పద్యంలో స్వామివారి పాద మహాత్మ్యాన్ని

స్పష్టంగా తెలియజేయడం, 76వ పద్యంలో నన్ను హంసగా మార్చవా అని ప్రార్థించడం, 84వ పద్యంలో స్వామిని భావగ్రాహిగా భావించడం, 88వ పద్యంలో 'చిద్దాక్షిణ్యము చూపవా..." అని ప్రాధేయ పడడం కవి గొప్పదన్నాన్ని తెలిపేలా వెలుగులు చిమ్ముతున్నాయి.

91వ పద్యం పారాయణ చేస్తే నవగ్రహదోషాలు తొలిగే విధంగా నామగోపన చేయడం, 92వ పద్యంలో గోమూత్రికా బంధం ఒక పాదంలో గూఢంగా ఉంచడం కవి గడుసుదనానికి, చేయి తిరిగినతనానికి గుర్తులుగా ఉన్నాయి. 108వ పద్యంలో కవి కృషిని గూఢంగా తెలపడం మనకు ఆనందన్ని కల్గిస్తుంది.

ఈ కవి ఎంతో ప్రణాళికా బద్ధంగా రచనలు సాగిస్తున్నారేమో అనిపిస్తుంది. ఆదిత్యం, అంబికాం, విష్ణుం, గణనాథం, అన్న తీరుగా ఈ శతకంతో విష్ణు పూజ కూడా పూర్తయింది. ఇక మహేశ్వర సమర్చన మిగిలి ఉన్నదా అనిపిస్తోంది. అదే వాస్తవమైతే పీయూష సదృశ కవిత్వంతో మహేశ్వర స్తుతి వీరి కలం నుండి రావలసి ఉన్నది. ఎదురు చూద్దాం. పంచాయతన పూజ పూర్తి అయితే కవిత్వ ప్రసాదం ఇక మహాసంతర్పణగా వేనవేల కావ్యాలుగా అవిర్భవించదూ! ఆ మహా సంతర్పణకు ఎదురు చూద్దాం. ప్రస్తుతానికి త్రివేణిలో రెండు మునకలు వేసి, రవంత శ్రీధర ప్రసాదం అందజేసాను. మహాప్రసాదం వడ్డించడం కవి వంతు. ఆరగించడం మన వంతు.

సుధీజన విధేయుడు

అవధాన రాజహంస, సహస్రావధాని

తణుకు **కోట వేంకట లక్ష్మీ నరసింహం**

అనంత వాహిని

"చోదయిత్రీ సూనృతానాం చేతన్తే సుమతీనామ్ యజ్ఞం దధే సరస్వతీ" (ఋగ్వేదము 1-3-11)

సత్య వాక్కులకు ప్రేరణా శక్తి, ధీమంతులకు చైతన్య ప్రదాయిని, సరస్వతి. ఈమె ప్రసరించే అనగా వ్యాపించే తత్త్వము కలది. ఆమె అందించిన వాక్ శక్తి పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అను నాలుగు స్థానములలో వ్యాపించును. "పరా వాక్ మూలదేశస్థా, పశ్యంతీ నాభి సంస్థితా, హృదిస్థా మధ్యమా జ్ఞేయా వైఖరీ కంఠ నిర్గతా" వాక్ శక్తి మానవులలో మూలాధార చక్రమున " పరా" రూపముగను, మణిపూర చక్రమున "పశ్యంతీ" రూపముగను, అనాహత చక్రమున "మధ్యమా" రూపముగను వ్యవహరించబడుచున్నదై విశుద్ధ చక్రమునుండి వెలువడునపుడు "వైఖరీ" రూపమున వ్యక్తమగుచున్నది.

కొంచెం స్పష్టముగా చెప్పాలంటే దీనినే సంకల్పము, సంజనిత భావము, మానసిక వాక్యము, ప్రకటిత వాక్కు అని చెప్పవచ్చును.

సరస్వతిచే ప్రేరితములై కంఠము నుండి నిర్గతములై కవితా రూపముగా నేర్పడిన అనంతుని పరా వాక్కుల సమాహారమే ఈ "శ్రీధర శతకము".

"శ్రీ" అనే పదానికి అనేకార్థములున్నా లక్ష్మీ దేవి, విషము అనే అర్థాలు గ్రహించి లక్ష్మీధరుడు- శ్రీ మహావిష్ణువు, విషధరుడు- శంకరుడు అని "శ్రీధర" పదానికి రెండర్థాలు చెప్పవచ్చు. వీరిద్దరు శ్రేయస్కరులే. జీవికి ఉనికిని రక్షణను కల్పించే వారొకరైతే,

అజ్ఞానమును లయము చేసి జ్ఞానమును ప్రసాదించువారు మరొకరు. కాన శ్రీ యన్. వి. అనంత కృష్ణ గారు "ఏక క్రియా ద్వ్యర్థికరీ" "ఒక పనియే రెండు ప్రయోజనములను కల్గించునది" అన్న రీతిగా "శ్రేయస్కరా శ్రీధరా" అన్న మకుటాన్ని ఏర్పరచుకుకొని హరిహరులను స్తుతించారు. వారి ముందు తన మనో వేదనను ప్రకటించారు. ఇందుకు నిదర్శనము.

దేవా కొండలరాయ యన్న గిరిపుత్రీభర్త వై పల్కుచున్
నీవే దిక్కిక శ్రీధరా యనగ కన్పించేవు శ్రీకంఠుగా
రావే యీశ్వర కావవే యనుచు సంప్రార్థింప విష్ణ్వాకృతిన్
సేవల్ పొందెడి సత్యదీప్తి విభవా శ్రేయస్కరా శ్రీధరా 90

ప్రారంభములోనే "భక్త మనోనుకూల శుభదా" అని ముందరి కాళ్ళకు బంధం వేసి, ఆశాపాశముల నుండి విడిపించమన్నారు. శాంతి సుగుణముల నందించమన్నారు. స్థిత ప్రజ్ఞతను నేర్పమన్నారు, పది పల్కులతో పదియవతారాలను స్తుతించారు(3వ పద్యము). పరమాత్మ చెట్టులో పుట్టలో గుట్టలో అన్నిట కన్పిస్తున్నాడు కాని మానవులలో కన్పించుటలేదు– ఉన్నాడు అని చెప్పినా ఒప్పుకోలేక పోతున్నారు. ఎందుకంటే వారిలోనున్న దుర్గుణాలే స్వామిని కప్పివేస్తున్నాయి అని వీరి నిశ్చయము (16,30 పద్యాలు).

నరుని హృదిలో ఆరుగురు శత్రువులు. శత్రుసంహారకుడైన శ్రీమన్నారాయణుని వద్దనున్నవి పంచాయుధములే కదా. మరి ఆరవ శత్రు సంహారమెలా? స్వామీ మీదు చిరునవ్వే చాలు, చిన్న నవ్వే

మేలు- అరిని పరిమార్చ అంతే చాలు అంటున్నారు రచయత (17వ పద్యము).

కండ్లకు గంతలు కట్టబడిన గానుగెద్దు గానుగ చుట్టూ తిరుగుతూనే యుంటుంది. కానీ ఇతరములను గమనించదు. అలాగే మాయతో కప్పబడిన జీవుడు కూడ - అని పాతకాలంలో పల్లెటూళ్ళల్లో కన్పించిన ఒక చిత్రాన్ని మన కనులముందుంచారు (20వ పద్యము).

కొబ్బరికాయ సంగతి మీకు తెలుసా? అనంత కృష్ణ గారి శతకములోని (24) పద్యమును చదివిన తరువాత ఇలా వివరించారనిపించింది. కొబ్బరికాయ- మనిషి పై పీచు- సంసార బంధ పాశములు పీచును తొలగించుట - బంధనములను చేదించుకొనుట (రజో గుణ నివృత్తి) పగుల గొట్టుట- తమోగుణమును భేదించుట తెల్లని కొబ్బరి- సత్వ గుణ ప్రకాశము కొబ్బరి నీరు తో అభిషేకము- సాత్విక భావనా బలముతో ఆర్ద్రతను పొందుట స్వామికి నివేదన- ఆత్మార్పణ.

జీవుడు భూమ్మీద పడ్డప్పుడే అతనితో పాటు పరమాత్మ కూడా వస్తాడు. ఒకే దేహములో జీవాత్మ-పరమాత్మ ఒకే కొమ్మ మీదున్న పక్షుల్లాగా “ద్వాసుపర్ణే సయుజా సఖాయౌ” అన్న విషయాన్ని గుర్తు చేస్తూ “నన్నొకచూపు చూడరాదా?” అని కోరుకుంటున్నాడు రచయత. ఇది అందరూ కోరదగినదే.

47వ పద్యములో పాలు, పెరుగు, తోడు, చిలుకుట, వెన్న, నెయ్యి అన్న పదాలు కన్పించినవి. వానిని చదువగానే గృహిణీ కృత్యము- నరుడు ఆచరించదగిన క్రియ గుర్తుకు వచ్చినవి.

శుద్ధమైన పాలు- సాత్వికమైన భావము వేడి చేయుట- స్వామి దర్శనమునకై తపించుట తోడుగా చల్లను వేయుట- భక్తిని జతచేయుట పెరుగు సిద్ధము- దృఢమైన దీక్ష చిలికి వెన్న తీయుట- తపించగా తపించగా స్వామి కనుపించుట వేడి చేయగా నెయ్యి సిద్ధము- స్వామి అనుగ్రహించగనే భవబంధ విమోచనము.

ప్రతి జీవుడు చేయవలసిన పనిని తమకన్వయించుకుంటూ వివరించారు. "నేను ఆచార్యుని బోధనను ధరిస్తాను. నీవే రక్షకుడవని నమ్ముతాను- ఇక నీవు చేయవలసినదల్లా నా బంధములను ఛేదించి ప్రార్ధనను అర్చనను స్వీకరించి నా వద్ద నిలబడి రక్షించుము ఎల్లవేళల" అని (57వ పద్యము).

"జ్ఞానమున్నప్పటికిని.... అహంకారము లేకుండిన నేను ఖ్యాతిని పొందెదను"- అన్నారు. జ్ఞానమున్నా లేకున్నా అహంకారము లేనప్పుడే మనిషి రాణించగలడు.

దీపము కాంతిలో వస్తుజాలమంతా ప్రకాశిస్తుంది. అలాగే లోనున్న జ్యోతి స్వరూపుని కాంతిలో పంచేంద్రియ శోభ, తనువు యొక్క తళతళలు కనువిందు చేస్తుంటాయి- ఈ పద్య భావము మంత్ర పుష్పములోని "తస్య మధ్యే మహానగ్నిః, తస్య మధ్యే వహ్ని శిఖా విద్యుల్లేఖేవ భాస్వరా" అన్న వాక్య భావములను గుర్తు చేయుచున్నది.

ఏదో కూటికి జాలిన విద్య- న్యాయవాద విద్య- చిత్ర విచిత్రముగా మాట్లాడి స్థానము నిలబెట్టుకుంటారు. కవిత్వములో కూడ. నవగ్రహ నామ గోపన చిత్రాన్ని (91), గోమూత్రికా బంధ గూఢ చతుర్ధ పాద

శార్దూల చిత్రమును (92) , ఇంతకు ముందే వ్రాసిన అనంత భాస్కర శతకములో రధబంధ చిత్రాన్ని వ్రాసి, కవిగా స్థానాన్ని నిలబెట్టుకున్నారు. న్యాయ శాస్త్రమనే శస్త్రాన్ని చేతబట్టిన అనంత కృష్ణ గారు అంకుశమును చేపట్టి మత్త గజాన్ని నడిపించే మావటీడుగా, కొరడా పట్టి అశ్వమును నడిపించే అశ్వశిక్షకుడిగా రూపం ధరిస్తారట – ఓ మానస మత్త గజమా, ఓ ఇంద్రియాశ్వమా జగ్రత్తహెూ జగ్రత్త. ఒళ్ళు దగ్గర పెట్టుకొని మసలుకొండి.

వీరి శిక్షణలో వ్యావహారిక పదాలు 'పద' 'పద'యని కొన్ని చోట్ల ముందుకు నడిచినవి. వాని ధాటికి తట్టుకోలేక వ్యాకరణ సమ్మతి పదాలు వెనుకంజ వేసినవి. అయినా అన్నీ నీకే ఇచ్చాను అంటూ పదాలను, మదిని, నైవేద్యంగా పెట్టారు(100).

అనంత భావ వాహినియైన ఆ సరస్వతి ఈ అనంత కృష్ణగారికి అనంతానంత భావసంపదనందీయ వలెనని ఆమెను ప్రార్థిస్తూ- ఆకాంక్షిస్తు- స్వస్తి.

"విమర్శక కవిశేఖర" "వేదావధాని"

02.08.2015, **సం॥ కే.కోదండరామాచార్యులు**

భానువాసరము

ఖమ్మము

అభినందన

శ్రీమదనన్య భావ వర శేముషి నొప్పెడి యాంధ్ర భాషలో
ధీమతి, సత్కవీశ్వర సుధీవరుడైన యనంత కృష్ణ సు
క్షేమము గోరి లోకులకు, శ్రీధర సత్ శతకంబు వ్రాసె. నీ
ధీమతి నెల్ల వేళలను దివ్యుడు శ్రీధరుడేలు సత్కృపన్.

శ్రీ నారుమంచి యనంత కృష్ణ కవి శతక రచన మూలమున 1.ఆదిత్య, 2.గణనాథ, 3.అంబిక, 4.విష్ణు, 5.మహేశ్వరులకు నిర్వహింప నెంచ నెంచిన పంచాయతన పూజా సంభారములలో మొదటి మూడు స్వర్ణమయ శతపత్రములను సిద్ధము చేసి సమర్చించి, నాల్గవ శతపత్రముగా నీ శ్రీధర శతకమును సంసిద్ధపరచి సమర్పణము గావింపనున్నారు. ఆ జగదంబ ఐదవ స్వర్ణమయ శతపత్రమునకు కూడా బీజారోపణము చేయించియే యుండును.

అనంత భక్తిభావ సంపన్నులైన శ్రీ యనంత కృష్ణ కవి పరాత్పరీ కృపామృత పాన లోలురగుటం జేసి ఏ దైవమునకైనను నిశ్శంకగా సన్నిహితులై తన హృదయ కలశామృతాభిషేకముతో మైమరిపించి తన భావనాక్షయ స్వర్ణపుష్పార్చనచేసి తన హృదయమునావిష్కరించ గల పుణ్య మూర్తి. కావుననే . ఆదిత్య, గణనాథ, అంబికల కృపా పాత్రులై శ్రీధరు కృపనపేక్షించి శ్రీధర శతక రచనను గావించి యున్నారు.

ఈ శతకము ప్రారంభముననే శ్రీశా! భక్త మనోనుకూల! అని సంబోధించి ముందుగనే ఆ శ్రీహరి కాళ్ళకు బంధము వేసిన గడుసరి ఈ కవి.

2వ పద్యమున రాముని ఉదారగుణ సంపన్నతను వివరించుచు

నీకిక తెల్లవారినది అనే తెలుగు నుడికారమును సమయోచితముగా ప్రయోగించుట ద్వారా రసస్ఫూర్తికవసరమగు ఔచిత్యమును కనబరచినారు.

4వపద్యమున నాల్గు పాదములలో కేవల క్రియాపదములతో దశావతార నిరూపణ గావించిన సుకవి అనంత కృష్ణులు.

8వ పద్యమున రామాయణమును సంక్షిప్తముగా వివరించిన దిట్ట.

17వ పద్యమున శార్జ్ఞ, ఖడ్గ, శంఖ, లౌణి(గద), చక్రములతో పాటు శ్రీధరుని చిరునవ్వును కూడా ఒక ఆయుధముగా చేసి తనలోని కామాది అరిషడ్వర్గ నిర్మూలించెనని భావించి చెప్పుటలో నూతనత్వముట్టి పడుచున్నది.

19, 57 పద్య రచన గమనించినచో కవికి గల సంస్కృతభాషా భినివేశము ద్యోతకమగుచున్నది.

కళ్ళకు గంతలతో ఉండే గానుగెద్దులాగా అన్న జానపద నుడికారాన్ని 20వ పద్యములో "తైలాకర్షణ యంత్ర బద్ధ వృష నేత్ర స్థాన వస్త్రాకృతిన్" అని చక్కని సంస్కృత సమాస శోభాయమానంగా ప్రయోగించడం ఎంతగానో అందగించుచున్నది.

24 వ పద్యములో తానే పరమాత్మను ఆశ్రయించిన కొబ్బరిబొండమని, తనతో ముడిపడియున్న లంపటములనెడి పీచును తొలగించమని, చీకటులలముకొనియున్న కాయవంటి తనను ఛేదించమని, తనలోనుండే రాజసమనే కొబ్బరిని ఆరగించమని, సత్వాత్మ అనే జలాభిషేకము స్వీకరించి క్షేమమును కూర్చమని చెప్పుట ద్వారా కవికి గల ఐహికబంధ పరిజ్ఞానము, దానికి అంటని తన మనస్సు ద్యోతకమగుచున్నది.

27 వ పద్యమున అరిషడ్వర్గములకు మూలము ఆశ అని, అదే పుట్టకున్నచో అరిషడ్వర్గములకు చిక్కబడమని వివేకము కలిగి మూలమైన ఆ ఆశకు జిక్కకుండా చేయమని ప్రార్థించుట కవి యొక్క జ్ఞాన పరిపక్వతకు సూచకము.

28 వ పద్యమున 1. అథాతో బ్రహ్మ జిజ్ఞాసా! 2. జన్మాద్యస్య యతః! 3. శాస్త్రయోనిత్వాత్! 4. తత్తు సమన్వయాత్! అను మొదటి 4 బ్రహ్మసూత్రాలు ఏ వేదాంత విజ్ఞాన సర్వాస్వాన్ని మనకు తెలియ జేస్తున్నాయో ఆ పరిధికి చేరిన కవి తన పరిపక్వతను ఆ పరబ్రహ్మకు విన్నవించి ఆ ఫల ప్రాప్తి నీవే సుమా అని తెలియజేసిన విధము చూచినచో ఇది తప్పక అసాధారణ బ్రహ్మజ్ఞాన వివేచనా సరళి గోచరించుచున్నది.

40 వ పద్యము అద్భుతం. పరమాత్ముని తోడు అసంభవ కరణమగునని చక్కగా వివరించియున్నారు

42 వ పద్యమున కామము యొక్క స్థాన బలమును ఎంతో చక్కగా వివరించి యున్నారు. అరిషడ్వర్గమున కామమునకున్నది మొదటి స్థానము అత్యంత పతన హేతువగుచుండుట, అదే కామము ధర్మార్థ కామ మోక్షాల్లో 3వస్థానములో నుండి మోక్ష హేతువగుచున్నదని స్పష్టపరచి స్థాన బలమును వివరించుట ద్వారా కవికి గల నిశిత పరిశీలనాశక్తి ద్యోతకమగుచున్నది.

46 వ పద్యంలో తాను కూడా సనాతనుడనే అని చెప్పుకొనుట మూలమున కవికి ఉన్న ఆత్మజ్ఞాన పరిపక్వత బహిర్గతమగుచున్నది.

48 వ పద్యంలో భ్రాంతిని తగిలే మనసు అణిమాదులనే బ్రహ్మంగా భావించునని చక్కగా ఉన్న యదార్థాన్ని వివరించిరి.

49 వ పద్యంలో తనకున్న పరమభక్తియే ఇతరులకు ఉన్మాదంగా తోచినా గాని, ఆ ఉన్మాదమే పరమాత్మను చేర్చు మార్గమగుచో అదే తనకు కావలయునని, కవి పరమాత్మతో తాదాత్మ్యత పొందడమంటే ఏమిటో తెలియజేశారు.

51 వ, 77 వ, ఇంకను అనేక పద్యములలో కవికి గల దుష్కర ప్రాస ప్రయోగ నైపుణ్యమునకు నిదర్శనములు.

53 వ పద్యము కవి వృత్త్యానుప్రాసానిపుణతకు అద్దం పట్టుచున్నది.

67 (నామ గోపన చిత్రము) సరోజ, శర్మ, అనంత, వనజ, రామమూర్తి, అపర్ణ, కౌశిక్, కీర్తి, అని తన తల్లిదండ్రులు, తను తన భార్య, కూతురు అల్లుడు, కొడుకు, కోడలు- ఇలా బంధువుల నామములను పద్యాంతర్గతముగా బంధించిన విధము కవికి గల కవితాశేముషికి అద్దము పట్టుచున్నది.

81 వ పద్యమున భక్తి జ్ఞాన కర్మ యోగములు. 87 వ పద్యమున నవవిధ భక్తి మార్గాలు వివరించిన తీరు ప్రశంసనీయము.

91. వ పద్యమున (గ్రహ నామ గోపన చిత్రము) రవ్యాది నవ గ్రహ నామ గోపన చిత్రమద్భుతము.

92 వ పద్యములో గూఢ చతుర్థపాదమును మొదటి మూడు పాదములలో గోమూత్రికా బంధంలో విరచించుట ద్వారా కవికి గల చిత్రకవితానురక్తి రచనాభియుక్తి మనకు అవగతమగుచున్నది. ఇది కడుంగడు అభినందనీయము.గోమూత్రికా బంధ చిత్రము ప్రశంసార్హమై యొప్పుచున్నది.

94 నుండి 98వ పద్యములలో సాధన చతుష్టయము వివేకం వైరాగ్యం శమాది షట్కము ఏకాగ్రత ముముక్షుత్వము, శమము,

దమము. విశ్వాసము శ్రద్ధ, లక్షణాలు తెలిపారు.

100 వ పద్యమున నాస్తికుడు కూడా మోక్షార్హుడెట్లో వివరించిన తీరు ఆశ్చర్యము గొల్పక మానదు.

102 వ పద్యము నుండి 107 వ పద్యము వరకు భావోపనిషత్ అధారముగా లమిత్యాది పంచపూజలు, దాని లక్షణములు, తత్వము, చొప్పించుట కవికి గల అసాధారణ వేదాంత పరిజ్ఞానమును ప్రకాశింప జేయుచున్నది. 108 వ పద్యమున శ్రీ తాత్పర్యము స్వీకరించుమిదిగో అనుచు ఈ శతకమును ఆ శ్రీధరునకొసంగుటతో కవి హృదయము తేలికపడి ఆనంద పారవశ్యమునందినట్లు మనము గమనించ వచ్చును.

శ్రేయస్కారకుడైన శ్రీధరుడు మీ చిత్తంబు గుర్తించు. మీధ్యేయం బెన్నుచు, దివ్య సత్ ఫలములన్ దీప్తంబుగా గొల్పు. దుర్మాయామోహ విదూరుజేయుమిమ్ములన్. రాణింపగాజేయు. సుశ్రేయో రాజ్య విభుండుగా హరి పథశ్రీ మార్గమున్ వెల్గుడీ!

ఓంకారాశ్రిత సృష్టినంతటను జ్ఞానోదాసియై యుండు నా
ఐంకారంబు ననంత శాంభవియె మోహాంధంబు పోకార్పుతన్,
హ్రీంకారాఢ్య! యశాఢ్య కృష్ణ ఛవి సంప్రీతిన్ మదిం గొల్పుతన్
శ్రీంకారాక్షర ధామయౌచు కవికిన్ శ్రేయంబులం గూర్చుతన్.

స్వస్తి.

ఇట్లు

మియాపూర్. భాగ్యనగరము. బుధజన విధేయుడు,

(సెల్–9247272960) **చింతా రామ కృష్ణా రావు.**

నమస్సుమాంజలి

భాస్కరుడు తూర్పున ఉదయించి నాడు దశదిశల సూర్యకాంతులు నిండినవి. భాస్కరకరములు సకలలోకములకానందకరములు. సోదరులు అనంతకృష్ణగారి హృదయాకాశమున భాస్కర శతకోదయమైనది. ఆ భాస్కర శతకమునకు నా ముందు మాటలతో ఆహ్వానము పలుకు భాగ్యము నాకు దక్కినది. అది నాకు మహానందకారకము. ఇతఃపూర్వమే వారు లలితాదేవిపై నొక శతకమును విఘ్నేశ్వరునిపై మరియొక శతకమును ప్రచురించియున్నారు. వారు ఒక కావ్యము వ్రాయగల సమర్థులు. మంచి ఇతివృత్తముతో ఒక కావ్యము వ్రాయగలరన్న ఈ సోదరి కోరిక త్వరలో తీర్చగలరని నా నమ్మకము.

"శ్రేయస్కరా శ్రీధరా" యన్న మకుటముతో వారిప్పుడు మరొక శతకముతో మనముందు నిలిచినారు. వారి హృదయమీవరకే సవిత ృమండలమును స్తుతించినది. ఇప్పుడీ శతకమున ఆ సవితృ మధ్యవర్తియైన శ్రీమన్నారాయణుని స్తుతించుచున్నారు. ఈ శతకము వారి పాండితీ ప్రకర్షణకాక, వారి భక్తి ప్రపత్తులకద్దము పట్టుచున్నది. "శ్రీశా భక్త మనోనుకూల శుభదా శ్రీవత్స సంశోభితా" అని మొదలైన ఈ స్తుతియందును శ్రీధరుడు వారు కోరినట్లు శ్రీలను, శాంతిని ప్రసాదించవలెనని ప్రార్థించుచున్నాను.

"రామా నీవిక తెల్లవారగనె మా రాజన్న యట్లేయనిన్, రామా నీకిక తెల్లవారినది పోరాయన్న యట్లేయనిన్" రామా! నీకు రేపు పట్టాభిషేకమన్న తండ్రిమాటకు రాముడు శిరస్సువంచి "సరే" యన్నాడు, మరల పిలిచి అడవికి పొమ్మన్నాడు, అప్పుడు కూడా

“సరే” అన్నాడు చిరునవ్వుతో. ‘సమ దుఃఖ స్సుఖ క్షమా’ యన్న స్థితప్రజ్ఞుడు రాముడు. అట్టి రాముని స్థితప్రజ్ఞనీయమన్న అనంతకృష్ణగారి అంతరంగమునందు శ్రీరామచంద్రుడు చిరునవ్వుల వెన్నెలలతో ప్రకాశించవలెనని కోరుచున్నాను.

శ్రీ మహావిష్ణువు ధర్మ రక్షణార్ధము ధరపై దశాకృతులతో అవతరించిన తీరును అవతారముల పేర్లు చెప్పక వర్ణించిన తీరు వారి ప్రతిభకు నిదర్శనము (3వ పద్యము). ఈ పద్యమొక్కటి కాదు ఈ శతకమంతయు వారి కల్పనా చాతురికి, వృత్త రచనా ప్రతిభకు, భావ సౌందర్యమునకు, భాషానైపుణమునకు అద్దాల మండపము.

“ధృత్వా దేశిక బోధనం ధృడతయా దీనాళి బంధ్వేతి త్వాం” (57 వ పద్యము) సంస్కృత శ్లోకరచన. అయినను దీనియందు కూడ ‘ప్రాస’ పాటింపబడుట, మకుటముతో శోభిల్లుట వారి పాటవమును పట్టియిచ్చును. “ఆదిత్యాన్వయు రామ చంద్రునకు జన్మాద్యార్తి సంత్రాతకున్”(91 వ పద్యము) నవగ్రహ నామగోపన చిత్రం. ఈ పద్యమున నవగ్రహములు గోప్యముగా నుంచిన ధీశాలి. “శ్రీనీదౌట రయంబునన్ భవికమై శ్రేయస్సులన్ శ్రీలిడన్” (92వ పద్యము) గోమూత్రికా బంధ గూఢ చతుర్ధపాద శార్దూలము. ఇది వారి పాండిత్య ప్రకర్షకు పరమోదాహరణము.

బిందువులో సింధువును చూపినట్లు శ్రీ నారుమంచి వెంకట అనంతకృష్ణ గారు ఈ శతకమున వారి ప్రతిభను శతవిధముల ప్రదర్శించినారు. వారికి నా అభినందన నమస్సుమాంజలి.

విధేయురాలు

కేదార్ ఘాట్, వారణాసి. **డా॥ ఐ. రాజ్యలక్ష్మి**

శరణం ప్రపద్యే

సర్వ వ్యాపకమై, సర్వజ్ఞత కల్గి, సర్వ శక్తిమంతమైన ఆ సర్వాధిష్ఠాన చైతన్యము నిర్గుణమని, దానికి ఉపాసనా సౌలభ్యమునకై ఒక ఆకారమును కల్పించుకుని, దాని ఆలంబనగా సాధనా మార్గములో పయనిస్తాడని తద్వారా ఉద్ధరింపబడతాడని చెబుతారు. మా పెద్దలు చేసిన తపఃఫలముగా నాకు సద్గురువు అనుగ్రహము లభించింది. వారు చెప్పినది, నేను చేయవలసినది మరిచి పోకుండా ఆమ్నాయమొనరించు కునేందుకు నేను ఎన్నుకున్న వివిధ పద్ధతులలో ఈ శతక రచన ఒకటి. ముందుగా ఆ గురువుని సహస్రనామాలతో అర్చించుకున్నాను. వారి అనుగ్రహమే అమ్మ మా యింట కొలువుండుట. ఆ పంచాయతన సేవ ఒక వరం, అదృష్టం.

అమ్మ తత్త్వాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంగా 'లలిత పదముల మది లలిత గొలుతు' అన్న మకుటంతో ఒక శతకాన్ని వ్రాసుకున్నాను. పంచాయతన పూజలోని విశేషమేమిటంటే ఈ ఐదు తత్త్వాలు ఒకటి ప్రధానమై సంపుటం మధ్యలో ఉంచితే, మిగిలిన నాలుగు నాలుగు వైపులా ఉంచి పూజించటం. సాధకుని లక్ష్యము కొరకు ఈ ఐదింటిలో ఏదైనా ప్రధానముగా చేసికొనవచ్చును. నా సంపుటంలో అమ్మ మధ్యలో ఉంది. 'అనన్యాశ్చింతయంతో మాం.." అని కృష్ణుడు గీతలో చెప్పినట్లు అన్నిటా ఆ చిచ్ఛక్తిని దర్శించాలి. కదా. అలా ఉదయించినది పంచాయతన దేవతలపై శతకాలు వ్రాయాలి అని. అందుకే తరువాత ఆ నిర్గుణ పరబ్రహ్మమును 'వర సిద్ధి వినాయక భక్త పాలకా' అని గణనాధుని, అటుపై 'భాస్కరాదిత్య ఘృణి సంజ్ఞ భక్త వరద దివసకర

వరేణ్య సవితా తిగ్మ కిరణ' అని ఆ ప్రత్యక్ష దైవాన్ని స్మరించుకున్నాను. సంపుటంలో ప్రాదక్షిణ్యముగా చూస్తే అటుపై ఉన్నది నారాయణుడు. ఇదిగో "శ్రేయస్కరా శ్రీధరా" అని మీ ముందు ఉంచుతున్నాను. ఇందులో భాగముగా ఆ ఆశుతోషుని సేవకూడా దాదాపు పూర్తికావచ్చినది.

అయితే ఇది నా ప్రతిభ కాదు. వాడి దయ. దైవం మానుష రూపేణా అన్నట్లు, బోధించిన గురువులు ప్రధానులు. ఏ రూప ధ్యానము చేసినా ఆ సాకార మూర్తి విశేషాలు, నిర్గుణోపాసనా విధానాలు సాధికార గ్రంథాల అధ్యయనం చేసి, పెద్దల వద్ద శ్రవణంచేసి, వాటిని సదా మదిలో ఉంచుకునే ప్రయత్నం చేసాను. సాధికారముగా లేని అంశము ప్రస్తావించలేదు. స్వంత ఆలోచనలు కూడా శాస్త్ర విరుద్ధంగా చేయలేదని పరిశీలించిన పెద్దలన్నారు. వేరే ఏదో పనిలో ఉన్నప్పుడు, నిద్రలో ఏదో ఆలాపనగా పద్య పాదమో, పదమో, భావమో, మొత్తం పద్యమో స్ఫురింపచేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. అంటే, స్వామి తన పద్యాలు తానే నా ద్వారా పలికాడు అనే కదా. నాలో నాకు తెలియకుండా స్వామిని నిరంతర ధ్యానం జరుగుతున్నది అనిపించింది.

ఇక భావాన్ని పద్యంలో బంధించటంలో అవధాన రాజహంస, సహస్రావధాని బ్ర॥శ్రీ॥ కోట వేంకట లక్ష్మీ నరసింహం గారు, తమ్ముడుగారూ అంటూ అమిత ప్రేమతో పిలిచే చిత్ర కవితా సమ్రాట్ బ్ర॥శ్రీ॥ చింతా రామకృష్ణారావు గారు, ఆత్మీయ మిత్రులు శ్రీ కేశిరాజు కామేశ్వరి సారు, పాకాన పద్యాలు వ్రాయు చిరంజీవి మాడుగుల నాగ గురునాధ శర్మ ఇలా ఎందరో మహానుభావులు నాకు అండగా

ఉన్నారు. సరే దైవదత్తమైన సోదరి పిశిపాటి ప్రసాదు బావగారి ధర్మపత్ని రాజ్యలక్ష్మి గారైతే తాను స్వయాన తెలుగు పండితురాలై, విశ్వనాథ సాహిత్యంలో డాక్టరేట్ పట్టా పుచ్చుకుని కూడా నాకు చాలా తెలుసుననుకునే అమాయకురాలు. పాపం వీరిలో ఏ ఒక్కరికి కూడా 'విసుగు' 'చికాకు' అన్న ఆస్తులు లేవు. నేను ఫోను చేసినది తడవు నా పద్యం విని వారి ప్రోత్సాహాన్ని, అభిప్రాయాన్ని, ఆనందాన్ని అప్పటికప్పుడు పంచుకున్నారు. వారి స్వాంతన వాక్యాలు మరొక ప్రధాన కారణం నేను వ్రాయగలిగాననటానికి. వీరికి ఏమిస్తే ఋణం తీరుతుంది. మనస్ఫూర్తిగా నమస్కరించటం తప్ప.

ఇక ప్రోత్సాహముతో పాటు వారి అమూల్య అభిప్రాయాలు అందించిన మా కోట వారు, చింతా వారు, సోదరి రాజ్యలక్ష్మి తో పాటు నిరంతర సాహితీ వ్యవసాయ శీలురు, వేదావధాని, విమర్శక శేఖర శ్రీమాన్ కే.కోదండ రామాచార్యులు గార్లకు ఎంతేనీ ఋణపడి ఉంటాను. అవి అభిప్రాయాలనటం కంటే ఆశీర్వచనాలు అనుట సమంజసము.

ఇక పుస్తకం పూర్తి కావస్తున్న తరుణంలో దైవానుగ్రహం పరమహంస పరివ్రాజకులు శ్రీ శ్రీ శ్రీ విజ్ఞానానంద భారతీ స్వామివారి రూపంలో వచ్చింది. వారు చూసి ఆనంద పడి వారి అనుగ్రహాశ్శీసులు అభిప్రాయరూపంగా అందించారు. వారి ముందు 'న కర్మణా' చెప్పటం తప్ప ఇంకేమీ చేయలేను.

ఇంట గెలిచి రచ్చ గెలవమని నానుడి. ఇంట నేను గెలవలేదు. నన్ను గెలిపిస్తున్నారు నా కుటుంబ సభ్యులు. ఇటు పుల్ల అటు పెట్టక

పోయినా పట్టించుకోరు. మా వాడు ఇన్ని పుస్తకాలు వ్రాస్తున్నాడు అని మౌనంగా మురిసిపోయి నేను లేనప్పుడు నా భార్య వనజతో అంటుందిట మా అమ్మ. మరే అన్నీ మనం చూసుకుంటూ ఉంటే వ్రాసుకోవటానికి ఏమి ఇబ్బంది అన్న ఆ కోడలి సమాధానాలు ముచ్చట గొలిపే సన్నివేశాలు. పైగా మేనత్త కూడానేమో నా తల్లీ, భార్య సంభాషణలు వినవలసినవే. అమ్మకి నమస్కారాలు, భార్యకి అభినందనలు , పిల్లలకి ఆశీర్వచనాలు.

హైదరాబాదులో ఎందుకు, ఖమ్మంలోనే ఇల్లు తీసుకుని ఉండండి అని స్నేహితులు అనేంత అనుబంధం ఖమ్మంతో. అక్కడ అనేక మంది మిత్రులలో న్యాయవాది శ్రీ సర్వదేవభట్ల సోమశేఖర్ గారు ఒకరు. ఈ సారి మీ శతకం ఆవిష్కరణ మాత్రం ఖమ్మంలోనే. అని ఆత్మీయంగా పలికి ఆ బాధ్యత తన భుజానికెత్తుకున్నారు. ఖమ్మంలోని నామిత్రుల అభిమానాన్ని ఎలా కొలవటం. అందరిని అమ్మ చల్లగా కాపాడుగాక.

ఇక్కడ ఒక అజ్ఞాత వ్యక్తి గురించి ప్రస్థావించక పోతే ఎంత పాపమో. ఆయన పేరు గుప్తముగా ఉంచమన్న ఒక ప్రఖ్యాత వ్యక్తి, సహృదయుడు, ఆప్త మిత్రుడు. పద్యాభిమాని. మంచి ఉపన్యాసకులు. చక్కటి శాస్త్రీయమైన ప్రవచనాల చేయటంలో దిట్ట. అయ్యా పుస్తకం ప్రింటు చేస్తే నాకు కన్యాదాన ఫలితమొస్తుంది అని మిష పెట్టి, నా వెంట పడినారు. ఈ పుస్తకం ప్రకటించ బడుట వారి సౌజన్యమే. వారికి, వారి కుటుంబమునకు సర్వ శ్రేయస్సులు కలుగు గాక.

పుస్తకరూపం లో మీ ముందుకు రావటానికి మా శ్రీ పర్ఫెక్ట్ గ్రాఫిక్స్ సాయి గారు, ఆయన గుండెకాయ లాంటి మధు ఎంతో సహకరించారు. ఈ పుస్తకం లోని డిజైను గాని, సెట్టింగ్ గానీ ఇంత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఘనత మధుదే. అయితే అంతా అయిన తరువాత సాయి గారు వచ్చి చూసి చెప్పే చిన్ని చిన్ని మార్పులు ఎంతో విలువని పెంచేవిగా ఉంటాయి. భగవంతుడు వారికి సర్వదా మేలు చేయుగాక. నా యీ సాహసములో తప్పొప్పులు దొర్లవచ్చు. గుణదోషాలు మీకు తోచవచ్చు. కానీ పెద్దమనసుతో క్షమించి యత్కించిత్ మంచి కనబడినా స్వీకరించ ప్రార్ధన.

మీ

నారుమంచి వేంకట అనంత కృష్ణ

శ్రేయస్కరా శ్రీధరా శతకము

శ్రీశా భక్త మనోనుకూల శుభదా శ్రీవత్స సంశోభితా
రాశీభూత పురాకృతార్జిత ఫలా ప్రాణేశ్వరా శ్రీకరా
ఆశాపాశ విమోచకా నిరత సత్యాన్వేషణా దీక్షతో
శ్రీ శాంత్యాదులనొందు భాగ్యమిడరా శ్రేయస్కరా శ్రీధరా 1

రామా నీవిక తెల్లవారగనె మా రాజన్న యట్లేయనిన్
రామా నీకిక తెల్లవారినది పోరాయన్న యట్లేయనిన్
ఏ మాత్రమ్మును పొంగకన్ వగవకన్ యీ నీ స్థితప్రజ్ఞతన్
చేమోడ్పుల్ గొని మాకికన్ గరపుమా శ్రేయస్కరా శ్రీధరా 2

నీటన్ బుట్టుట కొండ మోయుట ధరన్ నీ కోరలందెచ్చుటన్
గోటన్ చీల్చుట కాలితో కొలుచుటన్ గొడ్డళ్ళ చేబూనుటన్
మాటన్ దాటక యుండుటన్ జగతిలో మాహాత్మ్యముల్ జూపుటన్
చేటున్ బాపుట లోక రక్షణ కదా శ్రేయస్కరా శ్రీధరా 3

ఆ భూజాతను కైకసూతినటు కోపాగ్న్యాకృతున్ లక్ష్మణున్
శోభామూర్తిని వాయునందను మహాశూన్యుండు శత్రుఘ్నునిన్
ఆభాసింపగ పంచ భూతముల నాత్మారాము దేహస్థులై
రే భావించగ రామ సంపుటమటున్ శ్రేయస్కరా శ్రీధరా 4

రాముండెచ్చటనుండునో హనుమ తా ప్రత్యక్షమౌనన్నచో
ఏమీ వింతయదెట్లు సాధ్యమని నేనెట్లంచు ప్రశ్నించగా
రాముండన్నను జీవుడంచు కపి తత్ప్రాణానిలంబంచు సత్
ప్రేమారంగను తెల్పినాడవుకదా శ్రేయస్కరా శ్రీధరా 5

నీవే ఫోతివహల్య వాలి శబరిన్ నీ వైరులన్ బ్రోవగా
ఆవాహించగ దర్భపైనజుడె తానస్త్రమ్ముగా మారెనే
నీవెవ్వారిని గాని బ్రోతువుగదా నేనేల కన్పట్టనో
జీవేశా నను కావగా కదలరా శ్రేయస్కరా శ్రీధరా 6

ఓయీ పుట్టితివన్న పుట్టకయె తానున్నట్లు సుస్పష్టమే
ఓయీ గిట్టితివన్న గిట్టినను తానున్నట్లు సుస్పష్టమే
ఓయీ భిన్నములందభిన్నమతి తానుండేటి జీవాత్మ ని
శ్శ్రేయంబందగ జేయమంటి వినరా శ్రేయస్కరా శ్రీధరా 7

క్షీరాన్నాకృతి వచ్చి సీత గొని భూశ్రీ వీడి కాంతార సం
చారుండై ఋషి సేవ జేసి సతికై సఖ్యత్వమాలోచనల్
పారావారము దాటి లంక జనుటన్ పాపాత్ము భంజించుటన్
శ్రీరామాకృతి లీలయా కరుణయా శ్రేయస్కరా శ్రీధరా 8

లౌల్యంబెంచక నీ యెడన్ త్రికరణాలన్ నీకెయర్పించినన్
బాల్యావస్థ చిదగ్ని తా పెరుగుచున్ వ్యాపించు సర్వాత్మయై
తుల్యంబే కొలువన్ సుధార్ద్ర రస మత్తున్ జేయు నీదైన సౌ
శీల్యంబయ్యది వామనా భవహరా శ్రేయస్కరా శ్రీధరా 9

దానస్వీకరణార్థతాగ్రభువుకే తానుంట సూచించుచున్
తానే బ్రహ్మమటంచు తానణువునై తానట్లె సర్వంబనిన్
యీ నీ బ్రాహ్మణ సంజ్ఞతో తెలుపు నిన్నేమంచు కీర్తింతు నా
రేనిన్నిన్నెద నిండ నింపి కొలుతున్ శ్రేయస్కరా శ్రీధరా 10

యుక్తాయుక్త వివేచనమ్మరసి భావోద్వేగ మాలా పరి
త్యక్తోద్యుక్తుడనై చరించి బహు విస్తారార్భటాటోప సం
సక్తమ్మౌ నిజ కర్మ సంపుటి తెగన్ స్వాత్మానుభూతిన్ సదా
సిక్తంబై చెలగన్ వరమ్మిడగదే శ్రేయస్కరా శ్రీధరా 11

ధ్యానాసక్తిని కండ్లు మూసుకుని సంధానింప యత్నించగా
కానన్ రావవి కాలుసేతులట నీ కళ్యాణ చిహ్నంబులున్
కానంబయ్యెననంత కాంతి వలె సాకారా నిరాకారమై
రే నా సందియమీవె తీర్చవలెరా శ్రేయస్కరా శ్రీధరా 12

ఆభూషాదుల తోడుతన్ ప్రకటమై యాశ్చర్య చర్యం గనన్
మా భాగ్యంబని మోద ఖేద వశులై మమ్మాదుకొమ్మన్నచో
శోభామూర్తిగ వృష్ణివంశ జలధిన్ సోమాకృతిన్ వెల్గు నీ
శ్రీ భావించు వరమ్ము నిమ్ము దయతో శ్రేయస్కరా శ్రీధరా 13

వాదమ్మేటికి నన్నుగాచుటకు రావా మార్గశీర్షమ్ముగా
వేదాంతాధ్యయనమ్ము జేయగలనే వేయేల గోవింద నీ
పాదాలన్ నెరనమ్మి కొల్చు పరమౌ భాగ్యమ్ము నాకీయవే
సేదన్ దీరెద సేవ జేసికొనుచున్ శ్రేయస్కరా శ్రీధరా 14

యోగక్షేమము నీవె జూతువని ధ్యేయోమూర్తిగా నిల్వగా
ఆ గాలిన్ శకటమ్ము కొంగనహిరాడారాక్షసోత్పాతముల్
వేగమ్మే తొలగించు భంగినిటు రావేమయ్య జాగేటికో
శ్రీగంటన్ నను కానరాదొ సతమున్ శ్రేయస్కరా శ్రీధరా 15

రాలన్ గంటిని చెట్ల గంటి నదులన్ రత్నాల నిన్ గంటి వే
యేలా యీ జగమందు నన్నిటను నిన్నే కంటి చేకొంటినే
యేలా కానగ నొప్పకుంటి జనులందీవుంట మాత్సర్య దు
శ్శీలమ్మో భయమో తగన్ తెలుపరా శ్రేయస్కరా శ్రీధరా 16

నీ శార్ఙ్గాహతి కోర్కెలన్ దునుమగా నీ ఖడ్గమా లోభమున్
నీ శంఖధ్వని క్రోధ భంజకమటున్ నీ లౌణి చక్రాలతో
ఆశా మోహ మదోద్ధతిన్ తెగడగా యా మత్సరమ్మోడెగా
శ్రీశా నీ చిరునవ్వు కాంతి పడగా శ్రేయస్కరా శ్రీధరా 17

చేతల్ బాడగ రూప వర్ణన వెసన్ చేయంగ నేనెంచగా
చేతంబాడెగ తన్మయంబున ప్రభూ స్వేదించి ప్రహ్లాదమై
చేతోవ ృత్తిని నిల్పుమా కదలకన్ సేవించ శబ్దాకృతిన్
చేతుల్ మోడ్చెద చేయి వీడకుమయా శ్రేయస్కరా శ్రీధరా 18

హే నాథా భవసంచితాఘ శమనా హేలా వినోదోత్సుకా
నానా భీతి నివారకా శుభకరా నాదానుసంధాయకా
ధ్యానోపాసన లక్షితా భయహరా దాసానుకంపానిధి
స్తేనౌమ్యచ్యుత రక్షకో భవ సదా శ్రేయస్కరా శ్రీధరా 19

నాలో నిన్నిడి నేను వేరనుట నానా జన్మ సంచారినై
తైలాకర్షణ యంత్ర బద్ధ వృష నేత్రస్థాన వస్త్రాక ృతిన్
లీలా మాయకు చిక్కి పోవుటయె, రాలేవా, సుదృష్టిన్ దయా
శీలా నాకిడగన్ సుశోభలలరన్ శ్రేయస్కరా శ్రీధరా 20

ఏలా దుఃఖము నన్ను నమ్ముకొనుమా యేకాంతభక్తిన్ సదా
కాలాబాధ్య సుఖమ్మునిత్తుననుచున్ కాపాడునొప్పందమే
కాలాతీతుడ నీదు మాటకదెలా కాలంబు చెల్లేను సు
శ్రీలిచ్చేనని చెప్పి వీడ తగునే శ్రేయస్కరా శ్రీధరా 21

నిద్రే పట్టదు పట్టినా మగతలో నీపైని సంధానమే
భద్రమ్మందును నీ పదమ్ముల కడన్ వాసమ్ము గావించుచోన్
క్షుద్రమ్మౌ విచికిత్స లేక మదిలో శోభిల్లు నీ తత్త్వమే
ఛిద్రమ్మై భవబంధముల్ తొలగగా శ్రేయస్కరా శ్రీధరా 22

వేషమ్మేయగు గాక నా తపము నిర్వీర్యంబులీ సాధనల్
భాషాదోషము మంత్రమందు కలుగన్ పాటింతువే తప్పులన్
దోషమ్మెట్లగు చూసి నేర్తుము కదా తొల్దొల్త బాల్యంబునన్
శేషంబించుక యేని గైకొనుమయా శ్రేయస్కరా శ్రీధరా 23

స్వామీ నేనొక నారికేళ గతి నీ సాన్నిధ్యమున్ కోరగా
ప్రేమన్ లంపట కేశముల్ పెరకుచున్ భేదించి తామిస్రమున్
తామా రాజస మారగింపు గొని సత్వాత్మాభిషేకమ్ము తో
క్షేమంబీయరె సర్వదా గురువరా శ్రేయస్కరా శ్రీధరా 24

కంటిన్ రాముని జానకీ యుతునిగా కాకుత్స వంశస్థుగా
కంటిన్ కృష్ణుని రుక్మిణీ ధవునిగా కవ్వించు గోపాలుగా
కంటన్ దోషము తొల్గజేయగదటో కాంచంగ చైతన్యమై
రెంటన్ గానగ నొక్కటై తెలియగా శ్రేయస్కరా శ్రీధరా 25

ఏమీలేనిదదేదియో దలుపగానేమో చలించే గదా
ఏమీ లేకయె యెంతయో కదలికై యేమేమొ పుట్టే గదా
ఏమాయన్ మరి మాయగాక యది తానేమారెగా వేరనిన్
ప్రేమాయన్ విని నీవె యా ఘనుడనిన్ శ్రేయస్కరా శ్రీధరా 26

ఆశించున్, లభియింపకున్న కుపితుండై, పొందగా లోభియై
రాశుల్ నింపగ మోహమై, మదముతో రాజంచు భావించుచున్
క్లేశోత్ప్రేరక మత్సరమ్ము వరుసన్ కేలూను మాలోపటన్
శ్రీశా ఆశకు చిక్కనీయకుమయా శ్రేయస్కరా శ్రీధరా 27

శుద్ధంబై యటుపై విచారణ విధిన్ శోధించుచున్ బ్రహ్మమున్
బుద్ధిన్ కంటిని మూలకారణము సర్వోత్పత్త్యవస్థాదులన్
శ్రద్ధాసక్తిగ నే భవజ్జనితమౌ శాస్త్రాది సాయమ్ముతో
సిద్ధంబయ్యెను నీవె యా ఫలముగా శ్రేయస్కరా శ్రీధరా 28

ఏమాశ్చర్యము చేతిలో నిమడవే యేపాత్రలో నీటిలో
నేమాత్రమ్మును చాలదంచు చని నీవీదేవు సంద్రమ్ములో
నీ మత్స్యాకృతి చూచుచుండగనె యీ నీ లీల బోధాదులున్
ప్రేమాప్లావిత నూత్న సృష్టి సలుపన్ శ్రేయస్కరా శ్రీధరా 29

కన్పించున్ బహు దోషముల్ జనులలో కన్పింపవీవేలనో
విన్పించున్ విపరీత వాక్య చయముల్ విన్పింపవే నీ శ్రుతుల్
మాన్పన్ మార్గము కాననీయదు మహామాయాంధకారమ్మహో
త్రేన్పుల్ తీయగ వెల్గునింప గదటో శ్రేయస్కరా శ్రీధరా 30

సంపాదించుట యందు చిత్తమిడకన్ స్వార్థమ్ము బంధింపకన్
పెంపొందించగ ప్రేమ తత్త్వమొకటే ద్వేషమ్ము పోనాడుచున్
సంపూర్ణత్వము సంతరించుటకునై సాధింప శాంతమ్ము ర
క్షింపన్ నాకిక దిక్కు నీవె కనగా శ్రేయస్కరా శ్రీధరా 31

భక్తుండాడిన మాట నిల్పుటకునై వ్యాపించినావంతటన్
ముక్తున్ జేయగ దుష్ట దానవ విభున్ మూర్ఖత్వమున్ జీల్చుచున్
వ్యక్తింగాక మృగమ్ముగాక నుభయంబౌ నారసింహమ్ముగా
సిక్తంబైతివి నార్ద్రతన్ ప్రకటమై శ్రేయస్కరా శ్రీధరా 32

ఈ సంసారమునీదనొక్క విధమా యెన్నెన్ని వేషమ్ములన్
వేసేమోగద యుద్ధరింపగను రావే భక్త సంరక్షకా
నాసాగ్రమ్మున భూమి మోసితివిగా నా బాధ చెప్పాలటో
చేసాయంబిడి పైకి లాగ వలెరా శ్రేయస్కరా శ్రీధరా 33

వేదాధ్యాయినిగాను శాస్త్రముల సంవీక్షింప దుస్సాధ్యమై
యేదో కూటికి జాలు విద్యలన నేనేమందు నిస్తేజుడన్
యీ దీనుంగృప చూడనెంచితివిగా యేనాటి పుణ్యంబహో
చేదోడైతివి ధన్యుడన్ నతులివే శ్రేయస్కరా శ్రీధరా 34

వ్రాయంజాలెద పద్యముల్ స్ఫురణలో వాగ్రూపమీ వైనచో
చేయంజాలెద యూహలన్ మనసులో చేతమ్ము నీవైనచో
వేయేలా నను కావగా తరలిరా వేవేగ, జాగేలనో
చేయందింపగ ప్రేముడిన్ తగనటో శ్రేయస్కరా శ్రీధరా 35

నా మేధో మథనమ్ము చేయ తలపన్ జ్ఞానామృతాపేక్షతో
సీమోల్లంఘిత దైత్య శక్తికొరిగెన్ సేద్యమ్ము శైలంబుగా
నేమీ జాగిక కూర్మమై కదలిరా యెట్లైన కాపాడరా
క్షేమంబొప్పగ సాధ్య సిద్ధి కలుగన్ శ్రేయస్కరా శ్రీధరా 36

ముద్దుల్ గొల్పెడు మోముతోనొరుల నీ మోహాన ముంచెత్తుచో
హద్దుల్ దాటినవారలన్ త్రుటిని సంహారమ్ము గావించుచో
నద్దానిన్ స్వపరాది భేద రహితా యాచింతునెట్లైన కిం
చిద్దాక్షిణ్యము చూపి రక్షనిడరా శ్రేయస్కరా శ్రీధరా 37

మూటల్ గట్టుక వచ్చినాడ కదరా ముందన్ని జన్మాలలో
వాటిన్ వీడగ శక్యమే వదలవే వారింపగా సాధ్యమే
గోటన్ కొండను మోసినాడవని నే కోరేను నన్నాదుకో
చేటుల్ బాపగ నీవయే నిజమిదే శ్రేయస్కరా శ్రీధరా 38

నీ చైతన్యము శాశ్వతమ్మనుచు నే నీ స్ఫూర్తితో నిండగా
నీ చైతన్యమునంతటన్ సతతమున్ నిర్ద్వంద్వమై గాంచగా
నీచాలోచనలాపివేసి నను బల్నిర్వీర్య్య గావించు యీ
రేచీకట్లను మాపరా గురువరా శ్రేయస్కరా శ్రీధరా 39

నీతోడుండిన భాగ్యమై మనసులో నిస్తేజమే తేజమౌ
నీతోడుండిన యోగమై సఫలమై నిర్భాగ్యమే భాగ్యమౌ
నీతోడుండిన సాధనై క్షణములో నిర్వీర్యమే వీర్యమౌ
చేతుల్ మోడ్చెద తోడుగా నిలువరా శ్రేయస్కరా శ్రీధరా 40

ఆకాశంబటులంటవేవి కన తానన్నింట భాసించియున్
ఆకారమ్మది నేనెయన్న క్షణమే ఆ నామరూపాలతో
ప్రాకారమ్మున బద్ధుడై తిరుగు తా ప్రారబ్ధ బంధాలలో
చేకొమ్మా భ్రమలంటకుండ మెలగన్ శ్రేయస్కరా శ్రీధరా 41

ఏమందున్ మొదలందునుంచునెడ క్రోధేర్ష్యాదులుత్పన్నమౌ
కామంబయ్యది శత్రు షట్కమనగా గ్లానిప్రదంబౌను యా
కామంబుండిన ధర్మ మోక్షముల శ్లాఘ్యంబౌను పారమ్యమై
క్షేమంబొప్పుచు, స్థానమింత ఘనమా శ్రేయస్కరా శ్రీధరా 42

నీవేరా మము బ్రోతువంట కదరా నీ సాటి వేరేరిరా
నీ వాడన్ గనవేమిరా తరలిరా నీపాదమే దిక్కురా
నా వేషమ్ములనాపమందు వినరా నా ముద్దు చెల్లించరా
శ్రీవత్సాంకిత దేవరా శరణురా శ్రేయస్కరా శ్రీధరా 43

ఎన్నో రీతుల నిన్ను గూర్చి ఋషులై యెంతేని పల్కేరుగా
అన్నీ నీవని అంతటాకలవనిన్ హేరాన దారమ్ముగా
కన్నా నిన్నెరుగంగ కష్టతరమా కాపాడవా నీడవై
చెన్నారంగను చేతులెత్తి పిలువన్ శ్రేయస్కరా శ్రీధరా 44

దేహాంతఃకరణాది భ్రాంతి విడి సందేహాదులన్ జిక్కకన్
బాహాటమ్ముగ లోపలన్ సకలమీవై యుండు సత్యమ్ముకై
దాహార్తిన్ కడు తప్తమౌ బడుగునే దాక్షిణ్యమున్ జూపవే
స్నేహామోదము శీఘ్రమే తెలుపరా శ్రేయస్కరా శ్రీధరా 45

నీతోబుట్టినవాడ నీ కదలికే నేనౌచు వ్యాపించితిన్
ధ్యాతా ధ్యానము ధ్యేయ సంపుటిని నీయంతే సనాతుండనే
నాతోడన్ పరిహాసమా కినుకయా నాతోడ దోబూచులా
ప్రీతింజూపెడు చూపు చూడగదటో శ్రేయస్కరా శ్రీధరా 46

నీపాలన్ బడి తాపసుల్ పెరుగుచున్ నీ తోడుతన్ సర్వదా
పాపాలన్ చిలుకంగ పుణ్యఫలమై భాసించి వెన్నంటియున్
ప్రాపున్ నెయ్యము నిత్తువంట కదరా బాలుండ కాపాడవా
రేపున్ మాపన భావ్యమే కృపకనన్ శ్రేయస్కరా శ్రీధరా 47

రాజా రమ్మన వేషధారులగుచున్ రాగా భటుల్ వారినే
రాజంచున్ భ్రమనొందు వెర్రివలె సంప్రాప్తించు సిద్ధుల్ భవ
త్తేజంబంచును నెంచనీయక సదా ధీరత్వమిమ్మందు ని
స్తేజంబౌ యణిమాదులేటికనెదన్ శ్రేయస్కరా శ్రీధరా 48

ధ్యేయోమూర్తిగ నిల్చుచో తపమునో యే చేష్టలందైననో
నాయందే రమియించు నన్ను కనగా నన్ జూతురున్మాదిగా
ఆయున్మాదము నిన్ను చేర్చుననుచోనద్దాని వాఛించుటే
శ్రేయోదాయకమందునయ్య వినరా శ్రేయస్కరా శ్రీధరా 49

పాపాలన్ పరిమార్చుటందు ఘనుడా భక్తార్తి నిర్మూలకా
ప్రాపున్ బొందుచు కేశ సంపదనిడన్ వారింతువే క్లేశముల్
దాపున్ జేరదు దోషపంకమనగా దారిద్ర్యమెట్లుండు, 'కా
సేపైనన్' మది శ్రీనివాస యనగా శ్రేయస్కరా శ్రీధరా 50

నే క్ష్మాజమ్మటు నేపుగా పెరిగితిన్ నేర్వంగ లేదేమియున్
సూక్ష్మమ్మారయడందురే వినవటో సూచించగా రావె ధీ
లక్ష్మీ ప్రాప్తికి మార్గమేమిటని తెల్పన్ నిన్నె యర్థింతురా
శ్రీ క్ష్మాభర్తవు మాధవుండవనుచున్ శ్రేయస్కరా శ్రీధరా 51

సంసారమ్మున యాలుబిడ్డలనియా జన్మాది జన్మాంతమౌ
సంసర్గమ్మున చక్రబంధ గతిగా సాగేటి యజ్ఞానమే
హంసాస్త్రమ్మును నమ్మికొంటి గెలువన్ యాచింతు నీ సాయమే
హ్రీం సోపానము దాటి ముందుకరుగన్ శ్రేయస్కరా శ్రీధరా 52

శ్రీలిచ్చేవని శ్రీకరుండవనియున్ శ్రీ వత్సవక్షాంకితా
శ్రీలోలాయని శ్రీగిరీంద్ర సదనా శ్రీశాఖ్య శ్రీసంజ్ఞకా
శ్రీలాశించను శ్రీనివాస విభుడై శ్రీమంతు జేయంగదే
శ్రీలక్ష్మీధవ శ్రీపదమ్మడిగితిన్ శ్రేయస్కరా శ్రీధరా 53

ఏమీ పట్టదదేమిటో జడుడు వీడేలాగు జీవించునో
ప్రేమన్ ద్వేషమునొక్క భంగి కనునే భేదించడెవ్వారితో
స్వామీ యీ గతి పల్క తప్పు గదటో వ్యాసాత్మజుండర్భుడో
సీమల్ తెల్పవె యోగికిన్ జడునకున్ శ్రేయస్కరా శ్రీధరా 54

గోవిందాయని ఘోష పెట్ట వినవే కొండెక్కి కూర్చుంటివే
గోవత్సమ్ముల బంపజాల వెదుకన్ గూటస్థ జాగేటికో
నా వెంటన్ నిలువంగ వేడుకొనెదన్ నా దైవమీవేనయా
సేవింతున్ సతతమ్ము నీ చరణముల్ శ్రేయస్కరా శ్రీధరా 55

కానంబయ్యెడి నీలవర్ణముననాకాశమ్ము నిర్వర్ణమే
తానున్ వర్ణవిహీనమయ్యు జలమున్ తా తోచు నీలమ్ముగా
నీ నామాత్మక రూపుకావల కనన్ నీవున్నిరాకారమే
క్రీనీడల్ తొలగించి చూచునెడలన్ శ్రేయస్కరా శ్రీధరా 56

ధృత్వా దేశిక బోధనం దృఢతయా దీనాళి బంధ్వేతి త్వాం
మత్వా మత్కృతమర్చనం సవినయం మాంపాహి పాహీతి తే
భిత్వా బాధక బంధనం బహుముఖం స్వీకృత్య మత్ర్వార్ధనాం
స్థిత్వా రక్షతు సర్వదా కరుణయా శ్రేయస్కరా శ్రీధరా 57

మోక్షాపేక్షయదెట్లు కల్గగలదో మోహమ్ము ముంచెత్తునో
దీక్షాదక్షతకర్త్వతేమిటనియో ధీవృత్తి చాలేనటో
సాక్షీమాత్రుడనంచు తప్పుకొనకో సాన్నిధ్యమున్ జూపుచున్
శిక్షా దక్షతలిచ్చి బ్రోవవలెరా శ్రేయస్కరా శ్రీధరా 58

కార్యంబొక్కటి కారణమ్మెరుగకన్ కన్పట్టదే కాంచగా
కార్యంబై చను కారణమ్మరయగా కాసింత శోధించినన్
కార్యంబవ్వని కారణమ్మనగ నిక్కంబీవె, కాదన్న ని
ర్వీర్యంబౌనని సాధనల్ తెలిసెరా శ్రేయస్కరా శ్రీధరా 59

ఆపాదాంతము నాపయిన్ కరుణ పాదాబ్జాల జాల్వారగా
పాపక్షాళన తత్పరాయనగ సంప్రాప్తించ గంగాకృతిన్
లోపాలేటికి చేరు నాకడకికన్ లోనుండి పూతుండనై
శ్రీపాదార్చన భాగ్యమందితినయా శ్రేయస్కరా శ్రీధరా 60

మా యాలోచన దోష సంకులము క్షేమంబీయవే మాకికన్
మాయా లోచన బంధనమ్ము విడగా మాకింక దిక్కెవ్వరే
మాయా లో చననీక నిన్ను నిలుపున్ మా స్వామి యన్నానురా
శ్రేయోదాయక కావగా కదలిరా శ్రేయస్కరా శ్రీధరా 61

ప్రీతిన్ బొందను కర్మ భంగమగుటన్ బీడింప కామమ్ముచే
ప్రీతిన్ బొందను జ్ఞాన భంగమగుటన్ బీడింప క్రోధమ్ముచే
ప్రీతిన్ బొందను ధర్మ భంగమగుటన్ బీడింప లోభమ్ముచే
ప్రీతిన్ బొందెద నీదు పాద యుగళిన్ శ్రేయస్కరా శ్రీధరా 62

ముందౌజన్మల పుణ్యమై మిగిలెనేమో పూర్ణ కారుణ్యమై
పొందన్నేకరణత్రయాది శుభతల్ భో అచ్యుతానంత గో
విందా యంచును పల్కజేసితివి తద్వీర్యత్వ సాఫల్యమై
చిందుల్ త్రొక్కెను తన్మయత్వ గరిమన్ శ్రేయస్కరా శ్రీధరా 63

ఆమూలాగ్రము సంచరించు తరి మాయాగ్రంథులంద్రుంచుచున్
తామాకుబ్జకు సుందరాకృతి వలెన్ దామోదరా మాకికన్
భీమాజ్ఞానపు జీవభావముడుగన్ విశ్వాత్మకున్ జేయరే
క్షేమంబీయగ కారణమ్మరయకన్ శ్రేయస్కరా శ్రీధరా 64

ప్రాపుంబొందితి నీకడన్ గురుకృపన్ బ్రాక్పుణ్య సాఫల్యతన్
రూపంబొక్కటి యూహజేసి కొలువన్ రోమాంచితంబాయెనే
సోపానంబులనెక్కుచుండ తెలిసెన్ సూక్ష్మాతిసూక్ష్మమ్ముగా
స్త్రీపుంసాదులు కాని తేజమటులన్ శ్రేయస్కరా శ్రీధరా 65

వ్యక్తంబాయెను గంగ నీ వలన పాపాలన్ని పోనాడగా
భక్తిన్ గొల్చెదనయ్య శంకరుడవే భాసించ శ్రీమాతతో
శక్తిన్ ముక్తియు రక్షణల్ వరములన్ సాధుత్వమున్ గూర్చవే
రిక్తంబెట్లగు నీ కడన్ ఫలితముల్ శ్రేయస్కరా శ్రీధరా 66

చాలున్ పాదము తత్సరోజ రజమే శర్మంబు నాకిచ్చెడున్
ధీ లక్ష్యంబులనంత భావన జపాదిప్రక్రియల్ చేయగా
హేలామానుష రామమూర్తిగ యపర్ణేశాత్మసంచారకా
శ్రీలౌన్ కౌశిక శిష్యకీర్తి ఘనతన్ శ్రేయస్కరా శ్రీధరా 67

భార్యాబిడ్డల పోషణమ్మె యొకచో భారమ్ముగా మారునే
ధైర్యంబుండదదేమి తోచదుకదా తామెట్లు సాధింతురో
కార్యంబయ్యదనేక లోకములహో కాపాడి పోషించి ని
ర్వీర్యంబొందని రీతి నిల్పుటనగా శ్రేయస్కరా శ్రీధరా 68

అంతర్యామివదేలనో మరచి నేనజ్ఞానినై మెల్లగా
వింతౌ రోగము దేహభానమనగా పీడించ సాగేనయా
సుంతైనన్ దయరాదటో ననుగనన్ సూక్ష్మమ్ము బోధింపవే
చింతాకంతయు చింతయుండదటుపై శ్రేయస్కరా శ్రీధరా 69

భావింపన్ బహు రూపముల్ కలవు సంప్రార్థింప నామమ్ములున్
దేవా వీనిని వేరువేరనుచు సందేహించి భిన్నంబనిన్
నీ వారల్ గతి తప్పగా సరిగనన్ నీకేకదా చెల్లు రా
జీవాక్షా మొరలాలకింపుము వెసన్ శ్రేయస్కరా శ్రీధరా 70

నీలో లోకములన్ని యున్నవనుచున్నీనోట చూపించగా
ఆలోనన్ కనువారు తమ్ము గనుచో నాశ్చర్యమున్ పొందరే
లోలోనన్ మరి బాహ్యమందు గల నీ లోతెట్లు భావింతుమో
వ్రేలన్ గాచిన దైవమా నతులివే శ్రేయస్కరా శ్రీధరా 71

ఏ పాదాంబుజమూనినంత జడమయ్యేనేక చైతన్యమై
ఏ పాదాంబుజమర్చ జేయ కపియయ్యేనో చిరంజీవిగా
ఏ పాదాంబుజమార్ద్రతన్ పొరలగా యిక్కట్ల పోజేయు నా
శ్రీ పాదాంబుజ చింతనమ్మడిగెదన్ శ్రేయస్కరా శ్రీధరా 72

చుట్టంబెవ్వడు శత్రువెవ్వడరయన్ చోద్యంబు నాకయ్యెడిన్
మట్టున్ బెట్టుట తట్టి గాచుట కనన్ మాత్సర్యమో ప్రేమయో
తట్టెన్నీ కృపతోడ కర్మ ఫలమే తాత్పర్యమై పొంద మా
చిట్టాలన్ సరిజూచు లీల యటులన్ శ్రేయస్కరా శ్రీధరా 73

యుద్ధంబాయెను దైవ దానవ కళా యూధంపు సంపత్తికిన్
బద్ధున్ జేయక తామసాది గుణముల్ బాధింప వారింపరా
బుద్ధున్ జేయుము నిత్య శుద్ధ యుతమై పూర్ణత్వమున్ బొందగా
సిద్ధార్థంబగు ముక్తి నిచ్చు ఘనుడా శ్రేయస్కరా శ్రీధరా 74

పుత్రుండాతడు సృష్టి చేయడనుకో పోషింతువెవ్వారి నీ
మిత్రుండాతడు సంహరించునెడలన్ మీ శక్తిలో లోపమా
పాత్రౌచిత్యపు చేష్ట కంటినిక సర్వజ్ఞత్వమా యాటలన్
జిత్రంబేటికి మూలకారణ పరా శ్రేయస్కరా శ్రీధరా 75

ప్రారంభింపగ సాధనల్ వికలమౌ ప్రారబ్ధమో యేమిటో
సారంబెన్నగ సత్యమున్నితరమున్ సాధింప నిత్యత్వమున్
వేరుంజేసెడి విద్య నాకొసగుమా వేదాంత సుజ్ఞానమౌ
క్షీరంబందున హంసనై జలములన్ శ్రేయస్కరా శ్రీధరా 76

ఇష్టాపూర్తికి కష్ట వారణకు పాహీయంచు నీ దాసునిన్
పుష్టిన్ గొల్తురు నిన్నుమించు ఘనుడా పూజింపనన్నట్టి నా
దుష్టత్వమ్ముడుగన్ సదా కనిన హ ృద్వ్యోమాన నిన్నాతడే
శిష్టుండంటివి నీవె యాతడగుటన్ శ్రేయస్కరా శ్రీధరా 77

వాణీశాది సమస్త దైవగణముల్ బల్యాది దైత్యోత్తముల్
ప్రాణాప్తుండు కుచేలుడన్య మునులున్ పక్షీంద్ర శాఖాచరుల్
ప్రాణేశా యన సర్వమిచ్చు విభుడా పాలించు నేనుంటిరా
శ్రేణుల్ దీరిన వారిలో కడపటన్ శ్రేయస్కరా శ్రీధరా 78

శుద్ధాద్వైతులు ద్వైతులున్నితరులున్ శోధించి భేదించు నా
రాద్ధాంతమ్ముల జోలికిన్ జనకనారాధింతు రాధాసఖా
బద్ధున్ జేయకు మాయలన్ సతత సంబద్ధుండనై నీయెడన్
సిద్ధిన్ పొందు వరమ్ము నిమ్ముదయతో శ్రేయస్కరా శ్రీధరా 79

నేర్వన్ బూనిన విద్యలన్ ద ృఢమతిన్ నిస్తేజమై తోచునే
పూర్వాచార్యుల బాటలో నడచుచున్ పూర్ణత్వ సంధాయినై
సర్వాత్మత్వ విభూతి సాధన విధిన్ సర్వారి సంహార యా
శీర్వాదమ్మిడుమా దయన్ గురువరా శ్రేయస్కరా శ్రీధరా 80

ఖ్యాతిన్ బొందెద జ్ఞానముండిననహంకారమ్ము లేకుండినన్
నా తోడుండుము భక్తినిమ్ము ననుమానంబింత లేకుండగా
చేతంబందున యాశ లేని యటులన్ సేవించ నెవ్వారినిన్
జేతన్ జేయుము దోషపంక్తి తొలగన్ శ్రేయస్కరా శ్రీధరా 81

భిన్నంబుల్ మతముల్ విభిన్న గతులున్ భిన్నంబులాలోచనల్
భిన్నంబాస్తిక సంపదల్ నడవడుల్ భిన్నంబు పుండ్రమ్ములన్
భిన్నంబందునభిన్నునిన్ను మదిలో భీతుల్ సమూలంబు వి
ఛిన్నంబౌటకు పెక్కు మొక్కులిడెదన్ శ్రేయస్కరా శ్రీధరా 82

దీపంబయ్యది స్వీయకాంతి మహిమన్ దీపించునెల్లప్పుడా
దీపాలంబన పొందునంత వరకే దీపించునన్యంబులున్
నా పంచేంద్రియ శోభ కూడనటులే నా స్వంతమెట్లౌను యా
క్షేపంబేమిటి లోని నీ వెలుగుదే శ్రేయస్కరా శ్రీధరా 83

విత్తంబెన్న కుచేలునింట కలదా విద్యున్నదే వ్రేలలో
సత్తెంబెట్లగు చేష్టలున్ జనులనన్ సంభారముల్ నీ కడన్
బత్తిన్ శ్రద్ధయె ముఖ్యమై వరలు భావగ్రాహివీవౌటచే
చిత్తంబుంచెద పాద పద్మ యుగళిన్ శ్రేయస్కరా శ్రీధరా 84

సాష్టాంగంబిడెదన్ సభక్తికముగా సాకార కారుణ్యమా
కష్టంబోర్చెడి నమ్మికన్ గురువుపై గాఢంపు విశ్వాసమున్
దుష్టాలోచన చేయకుండునటులన్ దోషాళికిన్ జిక్కకన్
శిష్టాచార పరాయణత్వమిడరా శ్రేయస్కరా శ్రీధరా 85

యోగమ్మై లభియించె సాధనలలో నుత్తేజమే తేజమై
వేగమ్మై వెలుగొందె నీయెడలనా విశ్వాసమే శ్వాసయై
రాగమ్మై వికసించె సుప్తగణమా రాజీవమే జీవమై
జేగంటై రవళించె మంత్ర చయముల్ శ్రేయస్కరా శ్రీధరా 86

ఆకర్ణించుట పాడుటన్ స్మరణయున్ ఆ పాద సంసేవయో
నీకై యర్చన వందనంబిడుటయో నీ దాస్యమో సఖ్యమో
నీకై యాత్మనివేదనంబొసగుటో నే చేయగా నేర్తునే
శ్రీకార్యంబున నీవె నిల్పవలెరా శ్రేయస్కరా శ్రీధరా 87

చద్దుల్ తెచ్చియు పెట్టరేయని ప్రసాదమ్మట్లుగా మార్తువే
ముద్దల్ యెంగిలినెంచకన్ మెసవుచో మూర్ధన్యులో గొల్లలున్
విద్దెల్ రావని వారి కాచు ఘనతన్ వింతేమిటా రీతి కిం
చిద్దాక్షిణ్యము జూపు నాయెడలయున్ శ్రేయస్కరా శ్రీధరా 88

వ్యామోహమ్ము నశింపలేదు మరి యా యాలోచనే తోచదే
కామాదుల్ నను మూగుచుండునెడ సాక్షాత్కారమెట్లౌనురా
ఏమాయన్ కనుమా యనంగ విని నన్నీమాయ దాటింపవే
క్షేమంబొప్పగ నన్ను నేనెరుగగా శ్రేయస్కరా శ్రీధరా 89

దేవా కొండలరాయ యన్న గిరిపుత్రీభర్త వై పల్కుచున్
నీవే దిక్కిక శ్రీధరా యనగ కన్పించేవు శ్రీకంఠుగా
రావే యీశ్వర కావవే యనుచు సంప్రార్థింప విష్ణ్వాకృతిన్
సేవల్ పొందెడి సత్యదీప్తి విభవా శ్రేయస్కరా శ్రీధరా 90

ఆదిత్యాన్వయు రామచంద్రునకు జన్మాద్యార్తి సంత్రాతకున్
మోదమ్మౌ బుధవర్గ సద్గురునకున్ మూలైక విజ్ఞానికిన్
నా దైవమ్మని మందహాసునకు ప్రాణంబైన తచ్ఛాయకున్
చేదోడై నిలువంగ మొక్కులిడెదన్ శ్రేయస్కరా శ్రీధరా 91

శ్రీ నీదౌట రయంబునన్ భవికమై శ్రేయస్సులన్ శ్రీలిడన్
నానా క్లేశ గణమ్ము రాలవలెరా న్యాయమ్మురా శోధనల్
దీనాధార వరమ్ము నిచ్చి సహనోత్తేజస్కరా కావరా
శ్రీనాధా శరణమ్మురా భవహరా శ్రేయస్కరా శ్రీధరా 92

శ్రీ	నీ	దౌ	ట	ర	యం	బు	నన్	భ	వి	క	మై	శ్రే	య	స్సు	లన్	శ్రీ	లి	డన్
నా	నా	క్లే	శ	గ	ణ	మ్ము	రా	ల	వ	లె	రా	న్యా	య	మ్ము	రా	శో	ధ	నల్
దీ	నా	ధా	ర	వ	ర	మ్ము	ని	చ్చి	స	హ	నో	త్తే	జ	స్క	రా	కా	వ	రా
శ్రీ	నా	ధా	శ	ర	ణ	మ్ము	రా	భ	వ	హ	రా	శ్రే	య	స్క	రా	శ్రీ	ధ	రా

భక్తిన్ గొల్వ ప్రధానమందు నినునే భావింప ప్రహ్లాదమౌ
యుక్తిన్ మాయ ప్రధానమేయని ధ్రువమ్మొప్పంగ ప్రశ్నించుచున్
ముక్తిన్ జ్ఞాన ఫలంబుగా బడయగా ముందుండి రక్షింపరా
రిక్తంబెట్లగు సాధనల్ కృపగనన్ శ్రేయస్కరా శ్రీధరా 93

నిత్యానిత్య వివేకమిమ్ము దయతో నీవున్నచో చాలురా
సత్యాన్వేషణ నేర్పుమందు జడమున్ చైతన్యమున్ గాంచి భో
గత్యాగేచ్ఛయనిచ్ఛయున్ గలుగగా కాంక్షింతు వైరాగ్యమున్
ప్రీత్యాదుల్ కన తోచు కాకమలమై శ్రేయస్కరా శ్రీధరా 94

వైరాగ్యాంకుశ మిమ్ము మత్తగజ రూపంబౌ మనో మార్గమున్
పారంబందున నుంచగా, హయములై పర్వెత్తు నేత్రాది వ్యా
పారంబుల్ వశవర్తులై నిలుపగా వాంఛింతు చేగోలయున్
ప్రేరేపింపగ శాస్త్రచింతన విధిన్ శ్రేయస్కరా శ్రీధరా 95

భేదాలోచన మాన్పవే గురుడనన్ వేదాంత వాక్యంబులన్
వాదంబెన్నని భక్తితో ప్రబల విశ్వాసమ్ముతో శ్రద్ధతో
హ్లాదంబొందుచు బ్రహ్మభావన సదా లక్ష్యింపనేకాగ్రతన్
ఛేదింపన్నితరంబులన్ దృఢమతిన్ శ్రేయస్కరా శ్రీధరా 96

భ్రాంతిన్ వీడి తిరస్కరించునటులన్ వాంఛాపరిత్యాగినై
కాంతాదుల్ విషయాదులన్ విషమనిన్ కాదంచు సన్యస్తమై
చింతాద్వేషములుండకుండునటులన్ శీతోష్ణ యుగ్మంబులన్
చెంతన్ చేరెడి వేళ నోర్పునిడుమా శ్రేయస్కరా శ్రీధరా 97

క్షుద్దాహార్తుడు పెక్కునాళ్ళుగ తనాక్రోశించి శోధించునో
ముద్దైనన్ జలమైన నంచు కనునామూలాగ్రమేకాగ్రతన్
సద్దుజ్ఞేయని యేక చిత్తము ముముక్షత్వమ్ము నారీతి నా
చిద్దేశంబున నుండునట్లు గనుమా శ్రేయస్కరా శ్రీధరా 98

ఏయే జన్మములెత్తియుంటినని నేనే తావులంబుట్టి నే
నేయే కాలములందు నుంటినని నాకీరీతి యెన్నాళ్ళికన్
నాయందార్తినఖండ భక్తి యుతమౌ జ్ఞానమ్ము నాకీగదే
జ్ఞేయంబైనది పొందగా వడివడిన్ శ్రేయస్కరా శ్రీధరా 99

లేవంచున్ కలవా యటంచు వెదుకన్ లీలాకృతిన్ కాంచితిన్
త్రోవన్ సాగితి సత్యశోధనకునై తోచెన్నిరాకారమై
నీవున్నావని నిక్కమై తెలిసెరా నీకాంతిలో నేనుగా
జీవాత్మా పరమాత్మ సంగమమనన్ శ్రేయస్కరా శ్రీధరా 100

భోః పూర్ణా రిపు మర్దనా విమల సంపూర్ణత్వ మాశించి యం
తః పాంథుండగుచో నిశీధి గనగా ధైర్యంబు లోపించె   తే
జః పుంజమ్ముగ నా భయమ్ము తొలగన్ సాధింప లక్ష్యంబు నా
శీః పూర్ణంబుగ రక్షసేయవలెరా శ్రేయస్కరా శ్రీధరా 101

లంకాజేతకు భూమిజా పతికి లీలామానవాకారుకున్
శంకావారణ కారణమ్మునకు మత్సత్సంగ సాఫల్యమౌ
వంకన్ గంధమునద్దెదన్ గొనుమనిన్ వారింపగా జూడకన్
జింకన్ పట్టెడి మర్మమేమిటరయన్ శ్రేయస్కరా శ్రీధరా 102

హంసాకారుని సద్విభూతి వరదున్నాకాశ సంకాశునిన్
ధ్వంసంబౌటకు చిత్త వృత్తి విషమౌ వాంఛాది సంచారమౌ
కంసారిన్ బహు తాపహారిని హరిన్ గారమ్ముతో పుష్ప రా
శిం సాలంకృతు జేతు పూర్వ సుకృతిన్ శ్రేయస్కరా శ్రీధరా 103

యంత్రంబియ్యది వాయురూపునిగ నీవాడించినట్లాడునే
యంత్రారాధన చేతునా విపుల మాయాచ్ఛేద తంత్రంబులా
మంత్రమ్మా శుభముల్ సమాశ్రయములై మాయందు పెంపొందగా
హ్రీం త్రైలోక్యవశంకరా తెలుపరా శ్రేయస్కరా శ్రీధరా 104

రంగా రంగయటంచు శ్వాసగ నవిశ్రాంతంబు చింతించు నా
బెంగల్ దీర్తువు ముద్దు గూర్తువు సదా వెన్నంటి నా స్ఫూర్తివై
క్రుంగంజేయవు నాటుపోటులవి నిన్గొల్వంగ శ్రీ తేజమై
సింగారించ హృదిన్ సునిశ్చలముగా శ్రేయస్కరా శ్రీధరా 105

వందేళ్ళాయువు భోగ లాలసయు సంపాదించునాపేక్షతో
పొందన్ మానుష జన్మమేమి ఫలమో భోగింపగా భావ్యమే
విందుల్ గొమ్మిక సంచరించు మది నైవేద్యమ్ముగా నిత్తురా
చిందించయ్య సుధారసమ్మిక దయన్ శ్రేయస్కరా శ్రీధరా 106

సంతోషమ్మది సర్వ తత్త్వ యుతమై స్వాత్మానుసంధాయియై
భ్రాంతుల్ గూర్చెడి దేహభానముడుగన్ భాసించి చైతన్యమై
శాంతంబొక్కటి భావనా బలిమితో సాధింపనింకేలనో
చింతారత్నము కామధేను శతముల్ శ్రేయస్కరా శ్రీధరా 107

భీతిన్ బాపెడు దేశికున్ కొలచితిన్ వేవేల నామంబులన్
రీతిన్ జూపెడు విద్యకై పలికితిన్ శ్రీమాత పై పద్యముల్
ప్రీతిన్ గూర్చగ భవ్యమై నుడివితిన్ విఘ్నేశ సూర్యస్తుతుల్
శ్రీ తాత్పర్యము స్వీకరించుమిదిగో శ్రేయస్కరా శ్రీధరా 108

ఆకాశాత్ పతితం తోయం
యథా గచ్ఛతి సాగరం
సర్వ దేవ నమస్కారః
కేశవం ప్రతి గచ్ఛతి